ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మెదక్
20
గురువారం 17 ఆగస్టు 2017



ఇలా పనిచేస్తే ఎలా?


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోళికేరి

- మీ దగ్గర అంగన్‌వాడీ విద్యార్థుల వివరాలు లేవా?
- ఉద్యోగం వద్దనుకుంటే రాజీనామా చేయండి
- వైద్యశాఖ అధికారులపై కలెక్టర్ మండిపాటు
- చిన్నారులందరికీ టీకా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం

4 లో


సాగుకు వానేది?


నీళ్లు లేక వెలవెలబోతున్న సంగాయిపేట చెరువు

జిల్లాలో చినుకులే తప్ప భారీ వాన ల్లేవు.. కొన్ని రోజుల కిందట ఒకటీ రెండూ వర్షాలు కురిసి రైతులను మురిపించినా.. రానురానూ ఆశాజనకంగా లేకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. మొదట కురిసిన వర్షాలతో వరినాట్లు, ఇతర పంటలు వేసుకున్నారు. కానీ రేపో, ఎల్లుండో పడతాయిలే అనుకుని ఆశగా ఎదురుచూశారు. చివరికి వారికి కన్నీళ్లే మిగిలాయి. గట్టి వానలు లేక చెరువులూ నిండ లేదు. బోరుబావుల్లోనూ భూగర్భజలాలు అడుగంటుతుండడంతో పంట చివరి వరకు నీరు అందుతుందో? లేదోనని అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

- చినుకులే తప్ప భారీగా కురియని వర్షం
- జిల్లాలో ఎండిపోతున్న చెరువులు, పంటలు
- కార్తెలు కరిగిపోతున్నా కనికరించని వరుణుడు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఘణపురం ఆనకట్ట కింద మాత్రమే ఆశల 'సాగు'

5


చెరువు కింద ఎండిపోయిన వరి పంట

విద్యార్థిని ఆత్మహత్య

- డైట్‌సెట్‌లో సీటు రాలేదని మనస్తాపం
- కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న ఇందు
- రెడ్డిపల్లిలో ఘటన

3 లో

బాలల్లో సృజనాత్మకతను వెలికితీయడానికే 'సైన్స్ కాంగ్రెస్'

- జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

4 లో

రూ. 125కే విద్యుత్ కనెక్షన్

- గ్రామీణ ప్రాంతాల్లోని నూతన గృహ నిర్మాణదారులకే..
- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనాథ్

5 లో

మల్క్యాపూర్‌లో సాక్షర భారత్ ఉప సంచాలకులు


మల్క్యాపూర్ సాక్షర్‌భారత్ కేంద్రంలో రికార్డు లను పరిశీలిస్తున్న డీడీ ఉషామార్త స్వర్ణలత

5 లో

నాన్చడమే.. అస్సలు తేల్చరు


టేక్మాల్ మండలంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్

- టేక్మాల్ సోలార్ భూములపై కొలిక్కిరాని విచారణ
- సర్వే పేరుతో నెలల తరబడి కాలయాపన
- రైతుల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు
- హైకోర్టులో వాజ్యం వేసే యోచనలో స్థానికులు

4



మిరుదొడ్డిలో అసంపూర్తిగా ఉన్న పశువుల ఆసుపత్రి

నత్తనడకన
పశువుల ఆసుపత్రి నిర్మాణం

- ఏడాదైనా పూర్తికాని పనులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఎమ్మెల్యే చొరవ చూపాలని విన్నపం
- అద్దె భవనంలో ఆసుపత్రి

మిరుదొడ్డి: శిథిలావస్థలో ఉన్న పశువుల ఆసుపత్రికి పంచాయతీరాజ్ ద్వారా సుమారు రూ.25లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. గత ఏడాది రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి 22-09-2016 రోజున పశువుల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. దీంతో కాంట్రాక్టర్ స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. శాఖలో నిధులు పుష్కలంగా ఉన్న కాంట్రాక్టర్ మాత్రం తిరిగి పనులను ప్రారంభించకపోవడంతో ఆసుపత్రికి వచ్చే సిబ్బంది, రైతులు అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. పనులను ప్రారంభించి సంవత్సరం కావస్తున్న కూడా ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఆసుపత్రి పనులు పూర్తైయ్యే వరకు గ్రామంలో చిన్నపాటి అద్దె ఇంట్లో ఆసుపత్రిని కొనసాగిస్తున్నారు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడం వలన పశువైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోంటున్నారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి చొరవతీసుకుని ఆసుపత్రి పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే చేతుల మిదుగా ప్రారంభమైన శిలాఫలకం

ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

-పశువైద్యాధికారి దీప్తి



పశువుల ఆసుపత్రి పనులను త్వరగతిన పూర్తి చేసి, సమస్య పరిష్కరించాలి. మధ్యలో అగిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలి. అద్దె ఇంట్లో పశువుల ఆసుపత్రిని కొనసాగించడం వలన తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోంటున్నాము.

త్వరలోనే పనులను ప్రారంభిస్తాం..

పశువుల ఆసుపత్రి పనులను త్వరలోనే ప్రారంభిస్తాము. అనివార్య కారణాల వలన నిర్మాణ పనులను నిలిచిపోయాయి. త్వరలోనే పశువుల ఆసుపత్రి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకోస్తాము.

-పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి

గ్రామీణ తపాలా సేవకుల
నిరవధిక సమ్మె

- డివిజన్‌లో 500 మంది ఉద్యోగులు
- అరకొర వేతనంతో జీవనం
- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల కరువు
- పెన్షన్ సౌకర్యం కూడా లేదు
- టార్గెట్ల పేరుతో అధికారుల వేధింపులు
- సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

సంగారెడ్డి రూరల్ : గ్రామీణ తపాలా ఉద్యోగులు సంగారెడ్డిలో ప్రధాన తపాల కార్యాలయం వద్ద బుధవారం నిరవధిక సమ్మె చేపట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చిచేప్పారు. కేంద్ర ప్రభుత్వ తపాల శాఖలో అఖిల భారత గ్రామీణ తపాల సేవకులుగా విధులు నిర్వహించే వారికి శ్రమకు తగ్గ ప్రతిఫలం లభించడం లేదని... కనీసం ఈఎస్ఐ. పీఎఫ్ సౌకర్యాలు లేక చాలిచాలని జీతంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తపాల శాఖలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డిస్పాచ్ ఏజెంట్స్, చేల్ క్యారియర్స్ మూడు విభాగాల్లో గ్రామీణ తపాల సేవకులు సేవలందిస్తారు. వీరిలో బీపీఎం సబ్ డివజన్‌లో విధులు నిర్వహిస్తుండగా, డిస్పాచ్ ఏజెంట్లు ఇంటింటికి తిరిగి ఉత్తరాలను అందిస్తారు. మేల్ కొరియర్స్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఉత్తరాలను సేకరించి కార్యాలయానికి చేరవేస్తారు. గ్రామీణ తపాల సేవకులు కేవలం ఉత్తరాలను అందించడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆసరా పించన్లు, జాతీయ ఉపాధి హామీ కూలీ డబ్బులను కూడా అందజేస్తున్నమన్నారు. వీటితో పాటు సుకన్య సమృద్ధి యోజన పథకంలో ఇంటింటికి తిరిగి ఖాతాలు తెరిపించడం, పుష్కరాల సమయంలో గోదావరి జలాలు విక్రయించడం, భద్రాచలం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చే ప్రసాదాలు, క్యాలెండర్లు, డైరీలు విక్రయించడం తదితర సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లుతున్న గ్రామీణ తపాల సేవకులకు కనీస వేతనాలు కూడా చెల్లించకుండా నెలకు నామమాత్రంగా రూ.6వేల నుంచి పది వేల వరకు మాత్రమే అందిస్తున్నాయన్నారు. దీంతో తమ కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు మూడు గంటల వరకు మాత్రమే పని చేయాలని నిబంధనలు ఉన్నా 8నుంచి 10 గంటల వరకు పని చేస్తున్నామని ఆయినా తమ సేవలను గుర్తించకుండా అధికారులు వేదింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమకు టార్గెట్లు విధించి అధికారులు వేధిస్తున్నారని, తమ టార్గెట్ పూర్తి కాని పక్షంలో వేతనాల్లో కోతలు విధిస్తున్నారని తెలిపారు. తమకు వచ్చేదే చాలీ చాలని వేతనాలని వాటిలో నుంచి టార్గెట్ పూర్తి కాలేదని జీతాల్లో నుంచి తీసుకోవడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

ఈఎస్ఐ. పీఎఫ్ సౌకర్యాలు లేవు...

తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తున్నా తమను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ సేవలందిస్తున్న తపాల సేవకులకు వచ్చే జీతంలో నుంచి సగం బస్, ఆటో చార్జిలకే వెచ్చించాల్సి వస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకునేందుకు కూడా ఈఎస్ఐ సౌకర్యం లేదు కనీసం రిటైర్మెంట్ తరువాత పెన్షన్ కూడా చెల్లించరన్నారు. పీఎఫ్ సౌకర్యాలు ఉన్నా తమకు కొంత డబ్బులు అందుతాయని ధీమాగా ఉండేవారమని తమకు ఆ సౌలభ్యం కూడా లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. తపాల సేవకుల సమస్యలపై ప్రధాన మోదీ కమలేష్ చంద్ర కమిటీ వేయగా వారు సర్వే చేసి తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేస్తున్నారని గ్రహించి తమ సమస్యలపై 424 పేజీల నివేదికను సమర్పించారని తెలిపారు. అయినా కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోలేదని, చేసేది లేక యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరవధిక సమ్మె చెపట్టామని వారు తెలిపారు. ఇకనైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



సంగారెడ్డిలోని ప్రధాన తపాలా కార్యాలయంలో నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామీణ తపాల సేవకులు

తపాల ఉద్యోగుల డిమాండ్లు ఇవే...

- ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో సహా జీడీఎస్‌పే కమిటీ రిపోర్టును వెంటనే అమలు చేయాలి.
- 8 గంటల పనితో సివిల్ సర్వెంటు హోదా కల్పించాలి.
- కాట్ ఢిల్లీ, చెనై బెంచ్ తీర్పులకనుగుణంగా జీడీఎస్‌లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- టార్గెట్ల పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయడం, వేధించడం మానివేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అందజేయాలి

సమ్మె విరమించేది లేదు



మా సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె యధావిధిగా కొనసాగుతుంది. తపాల సేవకులు మూడు గంటల వరకు సేవలందిచాలని నిబంధనలు ఉన్నా ఎనిమిది గంటలు పని చేస్తున్నాం. అయినా మా సేవలను గుర్తించడం లేదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

-పి.సత్యనారాయణ,ఏఐజీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు

అధికారుల వేధింపులు ఆపాలి



టార్గెట్ల పేరుతో అధికారులు వేధింపులు నిలిపివేయాలి. అధికారుల వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. కనీస వేతనాలు అమలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అందించేందుకు మా సేవలను వినియోగించాలి.

-యూ.బస్వరాజ్, డివిజన్ కార్యదర్శి

మాకు న్యాయం చేయండి



మా సమస్యలు పరిష్కరించి న్యాయం చేయండి. జీతాలు సరిపోక పిల్లలు పస్థులుంటున్నారు. అనారోగ్యాలకు గురైతే ఆసుపత్రులకు వెళ్లాలంటే మాకు ఈఎస్ఐ కార్డు కూడా లేదు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. ఎనిమిది గంటలు పనిచేసేలా చూడాలి.

-టప్ప యాదమ్మ, తపాల సేవకురాలు

సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

ఉద్యోగపర్వం

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు



ఉపాధ్యాయులందరు సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి. వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. ప్రపంచ బ్యాంక్ ఆదేశానుసారం నూతన ఆర్థిక విధానాల అమలులో భాగంగా 2004 జనవరి 1 నుంచి ఆ నాటి ఎన్‌డీఏ ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంతో ఉమ్మడి రాష్ట్రంలో లక్ష20వేల మంది ఉపాధ్యాయ ఉద్యోగుల కుటుంబాల భద్రత అగమ్యగోచరంగా మారింది. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల మృతిచెందిన రిటైరైన ఉపాధ్యాయ ఉద్యోగుల కుటుంబాలు గ్రాట్యూటి, పీఎఫ్ లేక, పెన్షన్ అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తాం. నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపడుతాం. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తాం.

-నర్సాపూర్‌రూరల్

శ్రావణమాసంలో శుక్ర, మంగళవారాలకు ప్రత్యేకత

- మల్లికార్జున స్వామి ఆలయ పూజారి గంటంబొట్ల రవిప్రసాద్‌శర్మ

భక్తి



శ్రావణ మాసానికి ఎంతో విశిష్టత ఉంది. ప్రధానంగా ఈ మాసంలో వచ్చే శుక్ర, మంగళవారాలకు ప్రత్యేకస్థానం ఉంది. ఈ మాసం ఆడవాళ్లకు ఎంతో ముఖ్యమైంది. నాల్గు శుక్రవారాలు ఉదయం లేచి తలంటు స్నానం చేసి అమ్మవారిని పూజించాలి. ఇందులో రెండో శుక్రవారం చాలా ముఖ్యమైనది. శుక్లపక్ష పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఆ రోజు వరలక్ష్మీవ్రతం ఆచరిస్తారు. దీంతో లక్ష్మీదేవి కటాక్షం లభించి సకల సిరి సంపదలు, పుత్ర, సంతానాభివృద్ధి సుఖసంతోషాలు కల్గుతాయి. ఈ మాసంలో లక్ష్మీవ్రతం ఆచరిస్తే శుభప్రదం. మంగళవారాలు నోము ఆచరిస్తే సౌభాగ్యవంతులవుతారు. పసుపు, కుంకుమ కలకాలం నిలుస్తుంది. శ్రావణ మంగళవారం వ్రతాలు చేస్తే లక్ష్మీకటాక్షం కలిగి ఆరోగ్యవంతులుగా భర్త, పుత్రులతో చల్లగా ఉంటారు.

- కౌడిపల్లి

డైట్‌సెట్‌లో సీటు రాలేదని విద్యార్థి ఆత్మహత్య

చేగుంట: డైట్‌సెట్‌లో సీటు రాలేదని మనస్తాపం చెంది కిరోసిన్ పోసుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ని రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసు కుంది. చేగుంట ఎస్ఐ సత్యనారాయణ తెలిపి న వివరాల ప్రకారం రెడ్డిపల్లికి చెందిన ముప్పి డి ఇందు(17) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని డైట్‌సెట్ పరీక్ష రాసింది. పాస్ కాక పోవడంతో మనస్తాపం చెందిన బాలిక బుధ వారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసి న్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొనడంతో మాజీ సర్పంచ్ మృతి



మృతి చెందిన మాజీ సర్పంచ్ విఠల్‌గుప్తా

నారాయణఖేడ్: ట్రాక్టర్ ఢీ కొనడంతో కల్హేర్ మండలం నాగ్‌ధర్ మాజీ సర్పంచ్ బెల్డి విఠల్ గుప్త (65) మృతి చెందారని స్థానిక ఎస్ఐ నరేందర్ బుధవారం తెలిపారు. నాగ్‌ధర్‌కు చెందిన మాజీ సర్పంచ్ విఠల్ గుప్త స్కూటీ పై నారాయణఖేడ్‌కు వస్తుండగా ఖాంజీపూర్ సమీ పంలో వెనుక వైపు నుంచి ట్రాక్టర్ ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విఠల్ 1988 లో ఏకగ్రీవంగా నాగ్‌ధర్ సర్ప ంచ్‌గా ఎన్నికయ్యారని, ఆయన 1993 వరకు సర్పంచ్‌గా సేవలు అంది ంచారన్నారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారన్నారు. డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ రాములుచిస్తీ, సర్పంచ్ సరస్వతి వెంకటేశం, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ రాములు, కిషన్‌రావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ మాణిక్ ప్రభు, కల్హేర్ మండల సంఘం అధ్యక్షుడు మహేశ్వర్, ఆత్మ చైర్మన్ చీనూరి భాస్కర్ మాజీ సర్పంచ్ విఠల్ మృతి పై సంతాపం తెలిపారు.

గుండ్లమాచునూర్‌లో ఊరుకోళ్ల మృతి



మృతి చెందిన కోళ్లు

హత్నూర: మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన ఎండీ.జలీల్ తాను పెంచుకుంటున్న సుమారు 15 ఊరుకోళ్లు ఒక్కసారిగా మృతి చెందాయి. కొంతకాలంగా ఇంటి ఎదుట ఉన్న కొద్దిపాటి స్థలంలో ఒక గది నిర్మించి అందులో ఊరుకోళ్లను పెంచుతున్నాడు. అయితే మంగళవారం సాయంత్రం నుంచి ఆ కోళ్లలో ఒక్కొక్కటిగా బుధవారం ఉదయం వరకు సుమారు 15వరకు మృతి చెందినట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ విషయమై పశుసంవర్ధక శాఖ అధికారులకు కూడా సమాచారం ఇచ్చామని తెలిపాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చేర్యాల: మండలంలోని చుంచనకోట గ్రామానికి చెందిన బింగి అయిలయ్య వ్యవసాయబావి సమీపంలో గేదే ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రోజువారీ వ్యవసాయపనులలో భాగంగా గేదెను బావి వద్ద గడ్డి మేస్తుండగా, పక్కనే ఉన్న సూర్న ఎల్లయ్య బావి మోటారువద్ద తాగునీటిని సేవిస్తుండగా, స్టార్టర్ వైరు తేలి ఉండటంతో షాక్‌కు గురై మృత్యువాత పడింది. దీంతో సుమారు రూ.40వేల నష్టంవాటిల్లిందని అయిలయ్య తెలిపారు. ఈవిషయమై ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఫార్మాలో విద్యుదాఘాతంతో యువకుడి మృతి

• 'ఎమ్మెసెన్' యాజమాన్య నిర్లక్షం వల్లే ఘటన • తప్పించుకునే ప్రయత్నంలో యాజమాన్యం • నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్

పటాన్‌చెరు రూరల్: పాశమైలారం ఎమ్మెసెన్ ఫార్మా పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు, బీడీఎల్ సీఐ వేణు గోపాల్‌రెడ్డి, మృతుడి సంబంధీకులు అందించిన వివ రాల ప్రకారం బీహార్ రాష్ట్రం, వైశాలి జిల్లా ఖతారా గ్రామానికి చెందిన ఉపేందర్ రాయ్ (38) పాశ మైలారం ఎమ్మెసెన్ ఫార్మా పరిశ్రమలో ఓ సివిల్ కా ంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం విధి నిర్వహణలో వ్యాక్యూమ్ పంప్ వద్ద పని చేస్తు ండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. యాజమాన్యం వెంటనే అతడిని ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్ప త్రికి అక్కడి నుంచి బీరంగూడలో ఓ ప్రైవేటు ఆస్ప త్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసు కున్న బీడీఎల్ పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉపేందర్ రాయ్ మృతదేహం

పరిశ్రమ తీరుపై అన్నీ అనుమానాలే

మృతుడు పరిశ్రమకు చెందిన కార్మికుడు కాదని, సివిల్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడని యాజమా న్యం చెబుతున్న తీరుపై అన్నీ అనుమానాలే వ్యక్తమ వుతున్నాయి, పరిశ్రమ ఉద్యోగి కానప్పుడు అతడు పని చేస్తున్న ప్రదేశంలో విద్యుత్ సరఫరా ఉందని ముందే హెచ్చరించి, విద్యుత్ సరఫరా ఎందుకు నిలి పి వేయలేదని పాశమైలారం ఎంపీటీసీ శ్రీనివాస్ ప్ర శ్నించారు. పరిశ్రమలో యాజమాన్యం నిర్లక్ష్యంతో మృతి చెందితే యాజమాన్యానికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి 20 లక్షల రూపా యలు చెల్లించాలని ఆయన డిమండ్ చేసారు. కాగా విద్యుదాఘాతంతో మృతి చెందితే కావాలనే ఆస్పత్రికి తరలించి మృతదేహాన్ని బయటకు తేవటానికే యాజ మాన్యం హైడ్రామా ఆడిందని బంధువులు ఆరోపించ గా అతడి ప్రాణాలు కాపాడటానికే వెంటనే ఆస్పత్రికి తరలించామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. యాజమాన్య తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నందున మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించకుంటే ఊరుకోమని స్థానిక నేతలు తెలిపారు.

గంజాయి తోటలపై పోలీసుల దాడులు

• రూ. 5 లక్షల విలువైన 2వేల మొక్కలు ధ్వంసం

కంగ్టి: నమ్మదగిన సమాచారం మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్ర మంగా సాగు చేస్తున్న గంజాయి తోటపై దాడులు నిర్వహించి రూ.5 లక్షలు విలువ చేసే 2 వేల గం జాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు కంగ్టి సీఐ తిరుపతి యాదవ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధి లోని ఎన్కెమురి గ్రామ శివారులో మనూరు మండలం ఇర క్‌పల్లి తండాకు చెందిన రాథోడ్ మారుతి, రాథోడ్ మారోని బాయి కందిలో అంతర పంటగా 18 గుంటల విస్తీర్ణంలో 2 వేల గంజాయి మొక్కలు సాగు చేశారన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి బుధవారం దాడులు చేసి రూ.5 లక్షల విలువ చేసే గంజాయి మొక్కలను ధ్వ ంసం చేశామన్నారు. నిందితులు మారుతి, మారోనిబాయిపై కేసు నమోదు చేశామని సీఐ తిరుపతి యాదవ్ తెలిపారు.



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న సీఐ

జాతీయ జెండాకు అవమానం

● కట్కూర్ పాఠశాలలో జెండాను అవనతం చేయని సిబ్బంది

● హెచ్ఎంపై గ్రామస్థుల మండిపాటు

అక్కన్నపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న అక్కన్నపేట మండలం కట్కూర్ ప్రభుత్వ పాఠ శాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అయితే.. సూర్యాస్తమయానికి ముందే జాతీయ జెండాను అవనతం చేయాల్సి ఉండగా, మరుసటి రోజు ఉదయం 9.30 గంటల వరకు పట్టించుకోలేదు. దీంతో గ్రామస్థులు హెచ్ఎం లక్ష్మారెడ్డిపై మండిపడ్డారు. ఉదయం 9.30 గంటలైనా పాఠశాలకు ఎవరూ రాకపోవడంతో స్థాని కులే జాతీయ జెండా అవనతం చేసేందుకు వచ్చారు. అదే సమయంలో హెచ్ఎం పాఠశాలకు వచ్చి జెండాను దిం చారు. ఇప్పటి వరకు జెండాను ఎందుకు దించలేదని ప్రశ్ని ంచిన వారిపైనే హెచ్ఎం అసహనం వ్యక్తం చేశారని గ్రామ స్థులు తెలిపారు. కట్కూర్ సర్పంచ్ బడుగు రాంచంద్రం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జాతీయ జెండాను అవమాన పర్చిన హెచ్ఎం లక్ష్మారెడ్డిపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బుధవారం ఉదయం వరకు అవనతం కాని జెండా

సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని
ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

చేర్యాల: సర్దార్ సర్వాయి పాపన్న జయంత్యుత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు ముత్యం నర్సింహులు, మండలాధ్యక్షుడు మేరుగు కృష్ణ, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజు డిమాండ్ చేశారు. బుధ వారం కొమురవెల్లి మండల కేంద్రంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బహుజనుల అభ్యున్నతికోసం పోరాటం చేసిన మహనీయుడి త్యాగాన్ని గుర్తించాలన్నారు. సర్వాయి పాపన్న పోరాట పటిమను గుర్తించిన బ్రిటిష్ పాలకులు లండన్‌లో అల్బర్ట్ మ్యూజియంలో స్మారక విగ్రహాన్ని ఏర్పాటుచేసినా మన పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అన్ని వర్గాల మనోభావాలను కాపాడేం దుకు కృషిచేస్తున్న ప్రభుత్వం పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు.

జిల్లా కార్యాలయ స్థలం ఎంపికెప్పుడు?

- అన్ని జిల్లాల్లోనూ సిద్ధమయ్యాయి
- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి బహిరంగ లేఖ

మెదక్ రూరల్: నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రాల కలెక్టరేట్ స్థలాల ఎంపిక పూర్తయినా మెదక్ జిల్లా కార్యాలయ స్థలం ఎంపికలో జాప్యం ఎందుకని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కలెక్టర్ భారతి హోళీకేరికి బహిరంగ లేఖ రాశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల కలెక్టరేట్ భవనాల నిర్మాణం కోసం అన్ని చోట్ల స్థల ఎంపిక పూర్తయిందన్నారు. కానీ మెదక్ జిల్లా కలెక్టరేట్ విషయంలోనే ఆలస్యం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. ఈ విషయంలో కలెక్టర్ త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజల అభిప్రాయం మేరకు అనుకూలంగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున కలెక్టరేట్ కార్యాలయాన్ని అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉన్న ప్రస్తుత ఆర్డీవో కార్యాలయ సమీపంలోనే నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయ కోణంలో కాకుండా ప్రజలకు అనువుగా ఉండేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టరేట్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేస్తే అందుబాటులోనే బస్‌డిపో, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చర్చి, త్వరలో నిర్మించనున్న రైల్వేస్టేషన్ ఉంటాయన్నారు. ప్రజలకు అనువుగా ఉన్న ఆర్డీవో కార్యాలయంలో కలెక్టరేట్ ఏర్పాటుచేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉండడంతో పాటు మెదక్ పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంటనే కలెక్టరేట్ స్థలాన్ని ఎంపిక చేయాలని కోరారు.

బాలల్లో సృజనాత్మకతను వెలికితీయడానికే 'సైన్స్ కాంగ్రెస్'

జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి



జిల్లా కేంద్రంలో సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

మెదక్ అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడం, శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఏటా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తుందని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గీతా హైస్కూల్‌లో మెదక్, హవేళీఘణపూర్, రామాయంపేట, నిజాంపేట, పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, కొల్చారం మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 25వ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. 1993 నుంచి జాతీయ, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక ప్రసార మండలి ఆధ్వర్యంలో వీటిని ఏటా నిర్వహిస్తున్నామన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం పరిశోధన చేపట్టే విధంగా బాలలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. 10 ఏళ్ల నుంచి 17 ఏళ్లలోపు పిల్లలు పాల్గొనే విధంగా చూస్తున్నామన్నారు.

నిర్వహణ ఇలా..

బాలల సైన్స్ కాంగ్రెస్‌ను మూడంచెల్లో నిర్వహిస్తారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయిలో బాలల సైన్స్ కాంగ్రెస్ అక్టోబర్ మొదటి, రెండో వారంలో నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో అక్టోబర్ 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైతే డిసెంబర్‌లో అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు. ఇందుకు సంబంధించి మొదట రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయులకు శిక్షణ

బాలల జాతీయ కాంగ్రెస్ పోటీలలో పాల్గొనే బృందంలో ఐదుగురు బాలలుంటారు. 10 నుంచి 14 ఏళ్లలోపు వారిని జూనియర్ విభాగంగా, 14 నుంచి 17 ఏళ్ల లోపు వారిని సీనియర్ విభాగంగా పరిగణిస్తారు. ప్రాజెక్టు రూపకల్పనలో ఉపాధ్యాయుడిని గైడ్‌గా తీసుకోవచ్చు. తీసుకునే అంశం సుస్థిరాభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం సాంకేతిక వినూతన ఆవిష్కరణలు, సహజ వనరుల నిర్వహణ, వ్యవసాయం, ఆహారం, ఆరోగ్యం, శక్తి వనరులు, పరిసరాలు, పరిశుభ్రత, జీవన శైలులు, జీవనోపాధులు, సాంప్రదాయక విజ్ఞాన వ్యవస్థలు, విపత్తు నిర్వహణ వంటి అంశాలను తీసుకొని ప్రాజెక్టు రూపకల్పన చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సూచించారు. 17న తూప్రాన్‌లోని గీతా స్కూల్ నందు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల ఉపాధ్యాయులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, చిలపచెడ్, వెల్దుర్తి మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం ఉంటుందని విధిగా హాజరుకావాలని సూచించారు.

చిన్నారులకు రక్ష.. రుబెల్లా టీకా

- 9నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు తప్పక వేయించుకోవాలి
- నేటి నుంచి టీకా సరఫరా
- అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ భారతి హోళీకేరి



జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ భారతి హోళీకేరి

మెదక్ అర్బన్: కొంత కాలంగా చిన్నారులను పట్టి పీడిస్తున్న కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం కొత్త టీకాలను అందించడానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ భారతి హోళీకేరి అన్నారు. బుధవారం రుబెల్లా టీకాపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులకు కొత్త వ్యాక్సిన్‌ను వేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అన్ని చర్యలు పూర్తి చేసిందని తెలిపారు. అమ్మతల్లి, తట్టు, కంటి చూపు మందగించడం, చెవుడు, గుండె జబ్బు లక్షణాలున్న చిన్నారులతో పాటు పుట్టబోయే చిన్నారులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త కోసం మిజిల్స్ రుబెల్లా టీకాను 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు ఉన్న బాలబాలికలకు ఇంజెక్షన్ రూపంలో అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ టీకాను సరఫరా చేయనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో 2 లక్షల 969 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. టీకా వేయడం ప్రారంభం చేసినప్పటి నుంచి 16 రోజుల పాటు నిరంతరం పంపిణీ చేయాలన్నారు. పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు, వైద్యాధికారులు నవీన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇలా పనిచేస్తే ఎలా?

- మీ దగ్గర విద్యార్థుల వివరాలు లేవా?
- ఉద్యోగం వద్దనుకుంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోండి
- వైద్యశాఖ అధికారులపై కలెక్టర్ మండిపాటు

ఆంధ్రజ్యోతి, మెదక్: జిల్లాలో పాఠశాలలు, అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న విద్యార్థుల వివరాలు లేవా? ఆమాత్రం తెలియకుండా మీరేం పని చేస్తున్నారు. ఉద్యోగం వద్దనుకుంటే.. రాజీనామా చేసి ఇంట్లో కూర్చోండి, ఆశించిన స్థాయిలో పని చేయకుంటే ఫలితాలెలా వస్తాయి అంటూ కలెక్టర్ భారతిహోళీకేరి వైద్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్ వ్యాక్సిన్ వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె బుధవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 19 పీహెచ్ సీల పరిధిలోని చిన్నారులకు తప్పు రుబెల్లా టీకా వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలపట్ల సరైన సమాధానం ఇవ్వకపోవడంతో తీవ్రంగా మండిపడ్డారు. ఇలా పనిచేస్తే ఎలా అని మందలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఎంత మంది విద్యార్థులకు వ్యాక్సిన్ చేస్తున్నామనే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో ఏ ఒక్క విద్యార్థి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాన్చడమే.. అస్సలు తేల్చరు

- టేక్మాల్ సోలార్ భూములపై కొలిక్కిరాని విచారణ
- సర్వే పేరుతో నెలల తరబడి కాలయాపన ● రైతుల ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు
- హైకోర్టులో పిల్ వేసే యోచనలో స్థానికులు

ఆంధ్రజ్యోతి, మెదక్: ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతుంటే అడ్డుకోవడం అధికారుల బాధ్యత. పోనీ వాళ్లకు సమాచారం లేదంటే.. కనీసం స్థానికులు ఫిర్యాదు చేస్తే అయినా స్పందించి విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలి. కానీ ఇక్కడ ఆ రెండూ జరగనట్లే. అక్రమాలు జరుగుతున్నాయి మొర్రో.. అని ఆధారాలతో సహా అందించినా వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే కొందరు అధికారులు కంపెనీ యాజమాన్యాలకు లోపాయికారిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నిష్పక్షపాతంగా విచారణ జరిపి ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు.

సర్కారు భూములకు సోలార్ చెర

జిల్లాలోని టేక్మాల్, పాపన్నపేట మండలాల పరిధిలో రెండు భారీ సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపుగా పనులు కూడా పూర్తి కావచ్చాయి. సుమారు 8 గ్రామాల్లో వీటి కోసం పెద్ద ఎత్తున భూములను సేకరించారు. వందల ఎకరాల్లో సోలార్ ప్యానళ్లను నిర్మిస్తున్నారు. పట్టా భూములతో పాటు వివాదాస్పద, ప్రభుత్వ భూములు కూడా కొనుగోలు చేసి ప్లాంట్ నిర్మాణం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల చెరువులు, కుంటల పరిధిలోనూ నిర్మాణాలు చేసినట్లు తేలింది. అయినప్పటికీ సమగ్ర విచారణకు మాత్రం రెవెన్యూ అధికారులు ముందుకు రావడం లేదు. టేక్మాల్, ఎక్లాస్‌పూర్, ధనూర, పాల్వంచ తదితర గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూములు భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది. ఇంకొన్ని చోట్ల అయితే అసలు పట్టాదారులకు సమాచారం తెలియకుండానే భూము లు అమ్ముకున్న ఘటనలు వెలుగుచూశాయి. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడి పనులు చేస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మిన్నకుండి పోతున్నారు. సర్కారు భూమిలో వెలసిన ఆలయాన్ని సోలార్ కంపెనీ పేరిట జీపీఏ చేశారంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

సర్వే పూర్తి కాదు.. నివేదిక ఇవ్వరు

సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసిన భూముల్లో అవకతవకలు జరిగాయని గత ఆరేడు నెలలుగా స్థానికులు మండల, డివిజన్, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. రికార్డులు ఏ విధంగా తారుమారు చేసి భూములు సోలార్ కంపెనీకి ధారదత్తం చేసింది సాక్ష్యాలతో అధికారులకు అందజేశారు. వినతి పత్రాలివ్వగానే విచారణకు ఆదేశిస్తున్నామని అధికారులు హామీ ఇవ్వడం.. ఆ తర్వాత ఒకట్రెండు సార్లు కొలతలు వేసి మమ అనిపిస్తున్నారే తప్ప అంతకు మించి ముందుకు కదలడం లేదు. సోలార్ భూముల అక్రమాలపై కొన్ని నెలలుగా 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎక్లాస్‌పూర్ శివారులోని ఎర్రకుంట, సర్వే నెంబర్ 151 లోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ప్లాంట్ నిర్మాణాలను గత మే 27న మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఆ తర్వాత అదే స్పీడ్‌లో మిగిలిన అక్రమాల అంతు తేల్చుతారని మండల ప్రజలు ఆశించారు. ఆ ఒక్కటి మినహా మిగితా వాటి జోలికి మాత్రం వెళ్లడం లేదు. స్థానికులు ఎన్నిసార్లు అధికారులను సంప్రదించినా.. 'ఇదిగో సర్వే చేస్తున్నాం.. విచారణ నివేదికను త్వరలోనే కలెక్టర్‌కు అందజేస్తాం.. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామంటూ' కాలం వెళ్లదీస్తున్నారు. అక్రమాలపై ఇప్పటి వరకు సంబంధిత సోలార్ ప్లాంట్ యాజమాన్యాలకు కనీసం నోటీసిచ్చే సాహసం అధికారులు చేయలేకపోతున్నారు. టేక్మాల్ మండలంలోని ఓ కీలక రెవెన్యూ అధికారి వారికి వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జేసీ సురేష్ బాబు మండలానికి వెళ్లిన పలు సందర్భాల్లోనూ సోలార్ ప్లాంట్ ఏర్పాటులో అక్రమాలు ఉంటే సహించబోమని కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఎక్లాస్‌పూర్ శివారులో సోలార్‌ప్లాంట్ అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

హైకోర్టులో పిల్ వేసేందుకు సన్నద్ధమవుతున్న రైతులు

భూముల అక్రమాలపై ఇప్పటికే ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం నుంచి సరైన స్పందన రావడం లేదని భావిస్తున్న పలువురు రైతులు, స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. చెరువులు, కుంటలు, రికార్డుల తారుమారుకు సంబంధించి సేకరించిన ఆధారాలు, అధికారులకు ఫిర్యాదు చేసిన పత్రాలతో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) వేయబోతున్నట్లు టేక్మాల్ మండలానికి చెందిన పలువురు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు చెరువులు, కుంటలను కాపాడాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలుస్తోంది. న్యాయస్థానం విచారణకు ఆదేశిస్తే అక్రమాలు వెలుగుచూస్తాయనే అభిప్రాయం వారు వ్యక్తం చేస్తున్నారు. దాంతో పాటు లోకాయుక్తలోనూ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మల్కాపూర్‌లో సాక్షర భారత్ ఉప సంచాలకులు స్వర్ణలత

- గ్రామానికి 'సత్యమిత్ర' అవార్డుకు ప్రతిపాదన
- మల్కాపూర్‌ను సందర్శించనున్న కేంద్రం బృందం

తూప్రాన్: మల్కాపూర్ సాక్షర్‌భారత్ అక్షరాస్యత కేంద్రం రికార్డులను సాక్షర భారత ఉప సంచాలకులు ఉషమార్ల స్వర్ణలత బుధవారం పరిశీలించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించిన గ్రామంగా మల్కాపూర్‌లో ఎన్ఐఒఎస్ పరీక్షకు 100శాతం హాజరయ్యారు. మెదక్ జిల్లాలోని మల్కాపూర్‌ను కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యత గ్రామాలకు అందజేసే 'సత్యమిత్ర' అవార్డుకు ప్రతిపాదన చేశారు. అందులో త్వరలో కేంద్ర బృందం మల్కాపూర్‌ను సందర్శించి, సంపూర్ణ అక్షరాస్యత తీరును పరిశీలన చేయనున్నారు. రికార్డులు, కేంద్రాలను పరిశీలిస్తున్నారు. కేంద్ర బృందం రానున్న సందర్భంగా స్వర్ణలత మల్కాపూర్‌ను సందర్శించి ముందస్తుగా సాక్షర్‌భారత్ కేంద్రంలోని నిర్వహణ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. బృందం సందర్శన సందర్భంగా పరిశీలించే అంశాలను వివరించారు. సత్యమిత్ర అవార్డును అక్షరాస్యత దినోత్సవం సెప్టెంబర్ 8న ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచు జిన్న స్వామి, సాక్షర్ భారత్ మండల కోఆర్డినేటర్ మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు సిద్ధం కావాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రమేష్‌కుమార్‌మాదిగ


తూప్రాన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఎన్ రమేష్‌కుమార్

తూప్రాన్: ఎస్సీ వర్గీకరణ సాధనకు అలుపెరగని పోరాటం చేసేందుకు మరోసారి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రమేష్‌కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వర్గీకరణ సమస్యపై కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం మెదక్ జిల్లా తూప్రాన్‌లో జిల్లా ఇన్‌చార్జి ఆడేపు నాగార్జున అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేష్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్గీకరణ విషయంలో పెద్దమాదిగనై సాధిస్తానని హామీ ఇచ్చి, అసెంబ్లీలో కనీసం తీర్మానం చేయకపోవడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ సాధిస్తామన్న బీజేపీ మాట తప్పిందన్నారు. రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసి, అక్టోబర్ 14న చలో అమరావతితో మరో యుద్ధానికి సిద్ధం చేస్తున్నట్లు రమేష్ కుమార్‌మాదిగ పేర్కొన్నారు. మంద కృష్ణమాదిగ నాయకత్వంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని, వర్గీకరణ సాధన కోసం అలుపెరగని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందులో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి, రాష్ట్ర నాయకులు గజ్జెల బిక్షపతి, గజ్జెలరాములు, ఎంఈఎఫ్ నాయకుడు చెట్లపల్లి సత్యనారాయణ, చెట్లపల్లి యాదగిరి, సర్గల నాగులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న ఆర్డీసీ చైర్మన్ నర్సారెడ్డి


మనోహరాబాద్‌లో ముత్యాలమ్మను దర్శించుకున్న ఆర్డీసీ చైర్మన్ నర్సారెడ్డి

తూప్రాన్: మనోహరాబాద్‌లో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బుధవారం రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. ఈనెల 14న సోమవారం నుంచి శ్రీముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నారు. చివరిరోజైన బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టగా, కార్యక్రమానికి రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీసీ చైర్మన్ నర్సారెడ్డిని ఘనంగా సన్మానించారు.

సాగుకు వానేది?

- చినుకులే తప్ప కురవని భారీ వర్షం
- జిల్లాలో ఎండిపోతున్న చెరువులు, పంటలు
- కార్తెలు కరిగిపోతున్నా కనికరించని వరుణుడు
- ఎండిపోతున్న వ్యవసాయ బోర్లు
- ఘణపురం ఆనకట్ట కింద మాత్రమే ఆశల సాగు


నీళ్లు లేక పిచ్చిమొక్కలు మొలిచిన పిల్లికొట్టాల చెరువు

మెదక్ రూరల్: కార్తెలు కరిగిపోయి వర్షాకాలం దగ్గరపడుతున్నా ఆశించిన వర్షాలు కురియలేదు. అప్పుడప్పుడూ చిరుజల్లులు కురుస్తూ పోతుండడంతో ఖరీఫ్‌పై అన్నదాతల్లో ఆందోళన మొదలవుతోంది. సీజన్ ప్రారంభమై మూడు నెలలవుతున్నా ఇంకా చెరువుల్లోకి నీరు రాక వెలవెలబోతున్నాయి. ఆరుతడి పంటలకే ఆశాజనకంగా ఉన్న వానలు వరి సాగుకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియడంలేదు. దీంతో ఈసారి కాలం ఏమయితుందోనన్న ఆందోళన అందరిలో నెలకొంది.

జిల్లాలో సాధారణ వర్షపాతం మించి వానలు కురియలేదు. 20 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది. ఆగస్టుపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకోగా రెండురోజుల క్రితం పడిన చినుకులు తప్ప భారీ స్థాయిలో వర్షాలు కురియలేదు. దీంతో జిల్లాలోని చెరువులన్నీ నీరులేక వెలవెల బోతున్నాయి. చిరుజల్లులు కురుస్తున్నా ఏ చెరువు లోనూ ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. జిల్లాలో 94,117 హెక్టార్ల సాగు అంచనా ఉండగా 88,377 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి సాధారణం కంటే అధికంగా సాగయింది. ప్రధానంగా బోరు బావుల కింది భూముల్లో పంటలు సాగు చేయడం మూలంగా జిల్లాలో 44,350 హెక్టార్లలో వరి పంట సాగుచేశారు. మిగతా మొక్కజొన్న 19,240 హెక్టార్లలో, పత్తి 12,500 హెక్టార్లలో సాగయింది.

నీరులేక చెరువులన్నీ వెలవెల

ఆగస్టు నెల సగం గడిచిపోయినా జిల్లాలోని చెరువులన్నీ నీరులేక వెలవెల బోతున్నాయి. ప్రారంభంలో వర్షాలు మురిపించినా ఆ తర్వాత ఆశించిన స్థాయిలో కురియలేదు. దీని మూలంగా జిల్లాలో ఉన్న 3,494 చెరువుల్లో దాదాపు 90శాతం వరకు నీరులేక పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. అంతటా సాధారణ వర్షపాతం నమోదు కావడంతో దాదాపు చెరువులన్నీ వెలవెలపోయాయి. జిల్లాలో కేవలం నాలుగు మండలాల పరిధిలోని 27 చెరువుల్లో ఎంఎన్, ఎఫ్ఎన్ కెనాల్ నీటి వల్ల నిండాయే తప్ప మిగతా అన్ని చెరువుల్లో కొద్దిపాటి నీరు కూడా చేరలేదని రైతులు వాపోతున్నారు. ఘణపురం ఆయకట్టు కింద పాపన్నపేట, కొల్చారం, మెదక్, హవేళీఘణపూర్ మండలాల పరిధిలోని కెనాల్ ఆయకట్టు కింద మాత్రమే సుమారు 15 నుంచి 20 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. కెనాల్ పరివాహక ప్రాంతం మినహా మిగతా జిల్లాలోని ఏ చెరువులో కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. పెద్దచెరువుల్లో కూడా నీరు లేక ఆయకట్టు భూములన్నీ పిచ్చిమొక్కలతో బీడు భూములుగా మారిపోయాయి. మరో 15 రోజుల్లో వర్షాలు కురియకపోతే ఈ సారి కరువు తప్పేట్టు లేదన్న ఆందోళనలో రైతాంగం ఉంది.

బోరుబావుల వద్దే సాగు


జిల్లాలో వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు అధికశాతం బోరుబావుల కిందే వరి సాగు చేశారు. జిల్లాలో వరి సాధారణంకంటే ఎక్కువ సాగు కావడానికి ప్రధాన కారణం బోరుబావులే. అందులోనూ ప్రభుత్వం జిల్లాను ప్రయోగాత్మకంగా 24 గంటల విద్యుత్‌కు ఎంపిక చేయడంతో బోరు బావుల వద్ద సాగు గణనీయంగా పెరిగింది. చాలా వరకు భూగర్భజలాలు అడుగంటడంతో అన్నదాతలు పంట చివరి వరకు చేతికొస్తుందో.. లేదో? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌సీజన్ దగ్గర పడుతుండడం, వర్షాలు కురియకపోవడంతో బోర్లను నమ్ముకొని సాగుచేసిన రైతుల్లో భయం నెలకొంది. ఒకవేళ భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరు తగ్గిపోతే ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోవాల్సిందేనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంకా భారీ వర్షాలపై ఆశ

ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో రైతాంగమంతా గతయేడు మాదిరిగా ఈసారి కూడా చివర్లో భారీ వర్షాలు కురుస్తాయేమో నన్న ఆశలో ఉన్నారు. గత ఖరీఫ్‌సీజన్‌లో సీజన్ చివర్లో భారీ వర్షాలు కురవడంతో రైతాంగం గట్టెక్కింది. కానీ ఈ సారి మొదట్లోనే అన్నదాతలను వర్షాలు మురిపించడంతో సాగు జోరుగా చేశారు. కానీ కాలం గడిచినా కొద్ది వానలు మొహం చాటేయడంతో గతయేడు లాగా ఈ సారి కూడా అలాగే కురుస్తాయోనన్న ఆశలో చాలా మంది రైతులు ఉన్నారు.

రూ. 125కే విద్యుత్ కనెక్షన్

- గ్రామీణ ప్రాంతాల్లోని నూతన గృహ నిర్మాణదారులకే..
- ఇప్పటికే జిల్లాలో 400 కనెక్షన్లకు రిజిస్ట్రేషన్
- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనాథ్



'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్' విద్యుదీకరణ బ్యానర్


ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనాథ్

మెదక్: ఇక నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని గృహ నిర్మాణ దారులకు రూ.125కే విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనాథ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిరుపేద గృహ యజమానులకు దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ గ్రామీణ విద్యుదీకరణ పథకం కింద విద్యుత్ కనెక్షన్‌తో పాటు బల్బు, మీటర్‌బోర్డు, మీటరు, ఎంసీబీ స్విచ్ అందజేస్తున్నట్లు వెల్లడించారు. అయితే విద్యుత్‌శాఖకు బకాయిలు పడ్డ యజమానులు బకాయి బాపతి డబ్బును చెల్లించాకే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం పట్ల గ్రామీణ ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 400 లమంది గృహ యజమానులు విద్యుత్ కనెక్షన్ల కోసం తమ వివరాలు రిజిస్టర్ చేసుకున్నారని వివరించారు. ఈ సంవత్సరం 24,900 మంది తెల్ల రేషన్‌కార్డు కలిగిన గ్రామీణ గృహ యజమానులకు కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పథకం అమలులోకి వస్తుందని వెల్లడించారు.

ఈ పథకాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి గ్రామాల్లో దండోరా వేయిస్తున్నామని తెలిపారు.

ప్రగతిపథంలో తెల్లాపూర్

- గ్రామపంచాయతీకి నాలుగేళ్లలో రూ.16 కోట్ల పనులు
- రూ. కోటితో భవన నిర్మాణం
- అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు

రామచంద్రాపురం : మండలంలోని తెల్లాపూర్ గ్రామపంచాయతీ అభివృద్ధిలో జట్ స్పీడ్‌తో దూసుకుపోతోంది. మౌలిక వసతుల పెద్దపీట వేస్తున్నారు. గ్రామంలో పచ్చదనం, పారిశుధ్యాన్ని పాటిస్తూ ప్రగతి పథం వైపు పయనిస్తున్నారు. గ్రామానికి 'జిల్లా ఉత్తమ పంచాయతీ'గా కూడా అవార్డు వచ్చింది. గడిచిన నాలుగేళ్లలో రూ.16 కోట్లు పనులను చేపట్టారు. 14,403 మంది జనాభా కలిగిన తెల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు కాలనీలు, పది వెంచర్లు ఉన్నాయి. 16 మంది పంచాయతీ సభ్యులు, నలుగురు ఎంపీటీసీలు, జడ్పీటీసీ సహకారంతో సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి అందరిని కలుపుకుని వెళుతూ అభివృద్ధిలో ముందు నిలుపుతున్నారు. దాతల సహకారంతో రూ.కోటి వ్యయంతో గ్రామ పంచాయతీ భవన్నాన ఆధునిక హంగులతో నిర్మించారు. ఇందులో రూ. 10 లక్షలు మాత్రమే పంచాయతీ నిధుల నుంచి వెచ్చించినవి. తెల్లాపూర్ పంచాయతీ భవనం వంటి భవనం జిల్లాలో ఎక్కడా లేదు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో, పాత భవనాన్ని కూల్చివేసి నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని షైపేర్ అనే నిర్మాణ సంస్థ కోటికి పైగా నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని చేపడుతుంది. పంచాయతీ పరిధిలోని నూతన కాలనీలు కొమురంభీం, అంబేద్కర్, జ్యోతిరావు పూలే కాలనీల్లో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కోట్లాది రూపాయలు కేటాయించారు. అన్ని కాలనీల్లో మహిళా సంఘాల భవనాలు, సీనియర్ సిటిజన్ భవనాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, అభివృద్ధిని చేపట్టారు.

సినిమాలు

నర్సాపూర్

సాయి — జయ జానకీనాయక
శ్రీనివాస — నేనేరాజు నేనే మంత్రి

రామాయంపేట

సంతోష్ — నక్షత్రం
సాయిరామ్ — ఫిదా

పెద్దశంకరంపేట

లక్ష్మి — జయ జానకీనాయక

మెదక్

సినీమ్యాక్స్ — ఫిదా
గంగినేని — నేనేరాజు నేనే మంత్రి
సాగర్ — లై



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా భక్తమార్కండేయ ప్రతిష్ఠోత్సవాలు

రామాయంపేట:పట్టణంలోని భక్తమార్కండేయ ప్రతిష్ఠామహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం చండీయాగం, ప్రాతఃకాల పూజ, యంత్రాలపూజ, విగ్రహాల జలాదివాసంతో పాటు తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వేడుకల్లో పద్మశాలీ దంపతులు హోమంలో కూర్చున్నారు. అలాగే సరస్వతీ ఉపన్యాసకులు వేంకటేశ్వర బృందం ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తోంది. మార్కండేయ ఆలయ కమిటీ చైర్మన్ మద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యాదగిరి, రవి, బొద్దుల రాజలింగం, పెంటయ్య, బాల్‌రాజ్, సుధాకర్, వినోద్, గంగారాం, మోహన్, వెంకటేశం పాల్గొన్నారు.

'హరితహారం'ను విజయవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నగేష్

టేక్మాల్: హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెదక్ ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి నగేష్ పిలుపునిచ్చారు. బుధవారం టేక్మాల్‌లోని ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టేక్మాల్ మండలంలో 8లక్షల 19వేల లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 3లక్షల 17,280 మొక్కలను నాటడం జరిగిందన్నారు. 3లక్షల 73,239 గుంతలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హరితహారం కార్యక్రమంపై ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో విష్ణువర్ధన్, ఏపీవో సుధాకర్, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



దోమలనివారణ మందును పిచికారి చేస్తున్న శ్రీశైలం

టేక్మాల్: దోమలనివారణకోసం మురుగు కాలువలు, గుంతలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నివారణ మందు పిచికారి చేశారు. టేక్మాల్ మండలంలోని బర్దీపూర్ గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీశైలం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా గ్రామంలోని మురుగుకాలువలు, మురుగుగుంతల్లో దోమల నివారణ కోసం మందు స్ప్రేచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రంజిత్‌రెడ్డి, సంగమేశ్, సత్యం, సుధాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం

మెదక్ అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు ప్రశంసాపత్రం లభించింది. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి మల్లేశంను బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న 'ఈ పాస్' మిషన్లు

• ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లు

రేగోడు : రేషన్ సరుకులు ఈ పాస్ ద్వారా ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంతో రేషన్‌డీలర్లు సతమతమౌతున్నారు. ఈపాస్ మిషన్లు పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల నుంచి ఈ పాస్ మిషన్ ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో ఈ పాస్ మిషన్లు సిగ్నల్ లేక, తరచూ నిలిచిపోవడంతో రేషన్‌డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. మర్పల్లిలో సిగ్నల్ అందక, స్టాకప్ అవుతుండడంతో రోజు పదిమందికి సరుకులు ఇవ్వడం లేదని గ్రామస్థులు తెలిపారు. దోసపల్లి గ్రామంలో ఈ పాస్‌కు సిగ్నల్స్ అందడం లేదని రేషన్ సరుకులు పంపిణీ చేయడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఈ పాస్ విధానం భాగానే ఉన్న గ్రామాల్లో ప్రజలకు అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి యజమాని ఉంటేనే రేషన్ సరుకులు వస్తాయని ప్రజలు అంటున్నారు.

హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో ఉన్న రేషన్ సరుకుల కోసం గ్రామాలకు చేరుకున్నారు. రేషన్ సరుకుల పంపిణీకి ఈ పాస్ ఇబ్బందులు తొలగించాలని డీలర్లు కోరుతున్నారు.

సరుకులు అందడం లేదు

-మాణిక్యం, మర్పల్లి రేషన్ డీలర్



ఈ పాస్ సమస్యలతో ఒక రోజు పది మందికి రేషన్ సరుకులు అందిస్తున్నాం. ఈ పాస్ మిషన్‌కు సిగ్నల్ అందడం లేదు. ప్రజలు ఇబ్బంది పెడుతున్నారు.

ఎవరైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చు

-రాణాప్రతాప్‌సింగ్, తహసీల్దార్



ఈ పాస్ ద్వారా రేషన్ సరుకులు కుటుంబంలో ఎవరైన వచ్చి తీసుకెళ్లవచ్చు, రేషన్ దుకాణాలు, నెలరోజుల పాటు తెరిచి ఉంచుతారు. ఈ పాస్ మిషన్‌లపై అవగాహనలేక ఇబ్బంది ఉంది.వాటిని టెక్నికల్ సమస్య వస్తే బాగు చేయిస్తాం.



ఈ పాస్ మిషన్

నేటి నుంచి 'తట్టు, రూబెల్లా' నివారణకు టీకాలు



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఇర్షద్, అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టేక్మాల్: మెదక్ జిల్లాలో తట్టు, రూబెల్లా వ్యాధుల నివారణ కోసం 17 నుంచి 23వ తేదీ వరకు నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఇర్షద్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఫేరోజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం టేక్మాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదినెలల వయస్సు నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు తట్టు, రూబెల్లా వ్యాధినిరోధక టీకాలు వేయనున్నట్లు వివరించారు. మెదక్‌జిల్లాలో 2లక్షల 20వేల మంది లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా టేక్మాల్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి వైద్య సిబ్బందిచే ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత, సాయిబాబ, ఎంపీటీసీ సిద్దయ్యతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రేగోడులో

రేగోడు:ప్రాణాంతకరమైన తట్టు, రూబెల్లా వ్యాధిని తరిమేద్దామని రేగోడు వైద్యాధికారి శ్వేతప్రియ అన్నారు. బుధవారం రేగోడు, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో వైద్యసిబ్బంది అంగన్‌వాడీల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు మైసమ్మ సిబ్బంది కమల్, ఉపాధ్యాయులు మల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ సంగమణి తదితరులు ఉన్నారు.



చౌదర్‌పల్లిలో తట్టు, రూబెల్లాపై ర్యాలీ

పేద వధువుకు పుస్తె, మట్టెల పంపిణీ

చిన్నశంకరంపేట: పేద వధువుకు జాల లక్ష్మయ్య మెమోరియల్ ట్రస్ట్ పుస్తె, మట్టెలు అందించారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన పొలంపల్లి దేవయ్య, శాంతమ్మల కూతురు ఏసుమణి వివాహానికి జాల లక్ష్మయ్య మెమోరియల్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు జాల రవీంద్రకుమార్ హాజరై పుస్తె, మట్టెలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి సంపాదనలో ఎంతో కొంతభాగం ప్రజాసేవకు ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



పేద వధువుకు పుస్తె, మట్టెలను అందజేస్తున్న జాల లక్ష్మయ్య మెమోరియల్ ట్రస్ట్ అధినేత

జిల్లా కేంద్రంలో పీఎఫ్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

• సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి

చిన్నశంకరంపేట: జిల్లా కేంద్రంలో పీఎఫ్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీడీ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ జిల్లాలో 25వేల మందిబీడీ కార్మికులు ఉన్నారని, అందులో 7వేల పైచిలుకు కార్మికులకు మాత్రమే జీవనభృతి అందింద న్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేయగా మరో 2,500 మందికి ఈ భృతి ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొత్తానికి 10 వేల మంది జీవన భృతి పొందుతున్నారని తెలిపారు. మరో 15 వేల మంది కార్మికులకు భృతి అందకపోవడంతో వారు బీడీ కార్మికులు కారా అని ప్రశ్నిస్తున్నానన్నారు. ఇందుకోసమే జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. 28న సుమారు 5వేల మంది బీడీ కార్మికులతో కలెక్టరేట్‌లో తమ డిమాండ్లను గురించి తెలపనున్నట్లు ఆమె తెలిపారు.



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న బాలమణి

హెడ్‌మాస్టర్‌పై చర్య తీసుకోవాలి

• జిల్లా కలెక్టర్, డీఈవోకు గ్రామస్థుల వినతి

మెదక్ అర్బన్: విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీకాంత్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం అచ్చంపేట గ్రామస్థులు బుధవారం జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి, డీఈవో సరోజినిదేవీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2న పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న సుశాంత్ విద్యార్థిని దండిస్తూ.. తిడుతూ చిత్రహింసలకు గురిచేస్తున్న హెడ్‌మాస్టర్ శ్రీకాంత్‌గౌడ్‌ను సస్పెండ్‌చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఎంసీ చైర్మన్, గ్రామస్థులు కుమార్, రమేశ్, మహేష్, శ్రీను, రవి, విఠల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సాధించిన పతకాలతో విద్యార్థినులు

అంతర్జాతీయ కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థినుల ప్రతిభ

మెదక్ అర్బన్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో రెన్‌జుకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బాలికల విభాగంలో మెదక్ తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థినులు వివిధ విభాగాల్లో స్వర్ణం, రజితం, కాంస్య పతకాలు సాధించారు. స్పారింగ్ విభాగంలో జమున, వెన్నెల, నిఖిత, కె. వెన్నెల, అఖిత, సునీత, పుష్పలత, స్వర్ణం, కటాస్ విభాగంలో నిఖిత, జ్యోత్స్న, శ్యామల, రజితం పతకాలను సాధించారు. టీమ్ కటాస్ విభాగంలో వైష్ణవి, హోలీవా, సమత, శ్రీలత, మనీష, జీవిత, రజిత పతకాలు సాధించారు. రాఘవి, శివాణి, లావణ్య, సృష్టి, అఖిల, వెపెన్స్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించారు. పతకాలను సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కృష్ణ, పీఈటీ ప్రభుదేవచరణ్, దత్తురావు, శివకుమార్, రాజ్‌కుమార్, కరాటే మాస్టర్ నగేష్ పాల్గొన్నారు.

'ప్రత్యేక పంచాయతీల్లో కలపొద్దు'



మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తండావాసులు

నిజాంపేట: నిజాంపేట మండలంలోని బస్వరాజ్‌పల్లి గ్రామ పంచాయతీలోని తండాను ఫుట్‌చెరువు తండాలోకి కలపొద్దని తండావాసులు బుధవారం మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు. చాలాసంవత్సరాలుగా తండావాసులు బస్వరాజ్‌పల్లి గ్రామపంచాయతీ నుంచి అనేక సదుపాయాలు, ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటున్నామని, ఇతర తండాల్లో కలపడం ఇష్టం లేదని, సంక్షేమ ఫలాలకు అడ్డంకిగా మారుతుందని తండావాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్, మంగ్యా, రమణ, రాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌కు చేరనున్న పాదయాత్ర



పోచారం మీదుగా వెళ్తున్న పల్లకీ సేవారథం

రేగోడు : బీమ్మంద పీఠాధిపతి సోమలింగ శివాచార్య కమిటీ ఆధ్వర్యంలో పల్లకీ సేవారథం పాదయాత్ర బుధవారం ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లా బోరంచ నల్లపోచమ్మ ఆలయంనుంచి బయలుదేరిన పాదయాత్ర రేగోడు మండలంలోని సిందోల్ టి.లింగంపల్లి, పోచారం మీదుగా సంగారెడ్డిజిల్లా నారాయణఖేడ్ చేరనుందని తెలిపారు. ఈ పాదయాత్ర 20వ తేదీన బోర్గం బసవేశ్వర ఆలయం చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరంచ విఠల్, రేగోడు రాధాకిషన్‌గుప్త, ప్యారారం, సంగారెడ్డి, బసిరాంపాటిల్, తదితరులు ఉన్నారు.

'డ్రైవర్ కం ఓనర్' దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ

మెదక్ రూరల్: డ్రైవర్‌కం ఓనర్ దరఖాస్తుదారుల ఇంటర్వ్యూను బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ ఆధ్వర్యంలో జరిగాయి. ఉబేర్‌సంస్థ ప్రతినిధులు సమక్షంలో నిర్వహించిన ఇందులో అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

లక్ష్యానికి చేరువలో హరితహారం

• ఎక్సైజ్ సీఐ గోపాల్ నాయక్



ఈత మొక్కలను నాటుతున్న ఎక్సైజ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు

అల్లాదుర్గం: హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈత మొక్కలను నాటేందుకు నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో ఉన్నామని ఎక్సైజ్ సీఐ గోపాల్‌నాయక్ స్పష్టం చేశారు. బుధవారం అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామ శివారులోని కొముట్లకుంటలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో మూడువేల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రి, ఈఎస్‌జీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తమ పరిధిలో లక్షా పైచిలుకు ఈత మొక్కలను నాటవలసి ఉండగా 80 వేల ఈతమొక్కలను నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ అంజాగౌడ్, మాజీ సర్పంచ్ రాజాగౌడ్, ఎస్‌ఐలు యాదగిరి, విశ్వనాథం, సిబ్బంది మహేష్‌గౌడ్, ఆయాపార్టీల నాయకులు కృష్ణాగౌడ్, చాకలి నర్సింలు, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్ ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రాణమ్మ పాల్గొన్నారు. కాగా గంజాయి సాగు నివారణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని ఎక్సైజ్ సీఐ గోపాల్‌నాయక్ అన్నారు. బుధవారం అల్లాదుర్గం, గొల్లకుంట గిరిజన తండాల ప్రాంతాలలో పర్యటించి గంజాయిసాగుపై పర్యవేక్షించామన్నారు.

ప్రభుత్వ నిధులన్నీ సిద్దిపేటకేనా..?

• డీసీసీ ఉపాధ్యక్షుడు మామిళ్ల ఆంజనేయులు

మెదక్ రూరల్: రాష్ట్రప్రభుత్వం సిద్దిపేట జిల్లాకే నిధులన్నీ కేటాయించి మిగతా జిల్లా మొండిచేయి చూపిస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు మామిళ్ల ఆంజనేయులు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మెదక్ ఆర్డీవో కార్యాలయం కోసం అప్పట్లో మంత్రి సునీతారెడ్డి 2 కోట్లు మంజూరు చేయిస్తే ఆ నిధులను మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించారని ఆరోపించారు. ఇక్కడి ప్రజలకు సమస్యలు లేవా..? లేక మెదక్ జిల్లా ప్రజలు ప్రభుత్వానికి అవసరం లేదా.. అని ప్రశ్నించారు. మెడికల్ వైద్యకళాశాల కోసం సంగారెడ్డిలో జయప్రకాశ్‌రెడ్డి నిర్వహిస్తున్న అమరణ నిరాహార దీక్షకు మెదక్‌నుంచి భారీఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ మేళా

మెదక్ అర్బన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత సంవత్సరం డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం 18వ తేదీన హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ నరసింహం తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. నిరుద్యోగులకు వారి సామర్థ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను పొందుతారని, ఎలాంటి ఫీజులు లేవన్నారు. ఇతర వివరాలకు 7893822745 నంబర్‌ను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'తట్టు, రూబెల్లా'పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులు

హవేళీఘణపూర్: తట్టు, రూబెల్లా వ్యాధులపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని ఏఎన్‌ఎం సరిత పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన హవేళీఘణపూర్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆశావర్కర్లు భారతి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పథంలో ఇండియన్ బ్యాంకు'



వేడుకల్లో మాట్లాడుతున్న బ్రాంచి మేనేజర్ సంగీత

మెదక్ అర్బన్: అభివృద్ధిపథంలో ఇండియన్‌బ్యాంకు దూసుకుపోతోందని మెదక్ ఇండియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సంగీత పేర్కొన్నారు. ఇండియన్ బ్యాంకు ప్రారంభమై 111 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మెదక్‌శాఖలో వేడుకలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది శ్రీనివాస్, వాసు నాయక్, తేజ, జ్యోతి, లీగల్ అడ్వకేట్ లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'డైట్‌లో ఖాళీ లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి'



డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న టీజీవీపీ సభ్యులు

మెదక్ రూరల్: జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని టీజీవీపీ మెదక్‌జిల్లా కన్వీనర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హవేళీఘనపూర్ మండల కేంద్రంలోని డైట్‌శిక్షణ కేంద్రంలో 33 లెక్చరర్ పోస్టులకుగానూ కేవలం ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, కృష్ణ, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె

మెదక్ అర్బన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాక్రాంతి పథకంలో పనిచేస్తున్న అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెకు అనుమతి లేకపోవడంతో బుధవారం జిల్లా కేంద్రంలోని చర్చి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెదక్‌జిల్లా మండలస్థాయి ఉద్యోగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీనీల మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేదన్నారు. వెంటనే ఆగిపోయిన హెచ్‌ఆర్ పాలసీ సర్క్యులర్‌ను అమలుచేయాలన్నారు. శుక్రవారంనుంచి ర్యాలీలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

'విలీనాన్ని ఉపసంహరించుకోవాలి'

మెదక్ అర్బన్: రెవె న్యూశాఖను వ్యవసాయశాఖలో విలీనంను ఉపసంహరించుకోవాలని బుధవారం జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు వీఆర్‌ఏ జిల్లాకమిటీ అధ్యక్షుడు పోచయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు బాలమణి తెలిపారు.

'ఉన్నత శిఖరాలు అధిరోహించాలి'

చిన్నశంకరంపేట: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్ఐ ప్రకాశ్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల నుంచి ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన మంజూ చౌదరి, మణికంఠ, శిరీష, శరత్‌తేజ, ప్రవీణ్‌లను లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడారు. ఎంపికైన విద్యార్థులకు లయన్స్ సభ్యులు మెమోంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామకిష్టయ్య, సభ్యులు సాయిరెడ్డి, నరేందర్, ఎస్. రమేశ్‌గౌడ్, కె. రమేశ్‌గౌడ్, శ్రీమాన్‌రెడ్డి, బాబులాల్‌చౌదరి, సత్యనారాయణరెడ్డి, చంద్రంగౌడ్, జాల సాయిబాబా, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చౌట్లపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డుపనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీతాసాయిలు

హవేళీఘణపూర్: హవేళీఘణపూర్ పంచాయతీ పరిధిలోని చౌట్లపల్లి గ్రామంలో బుధవారం సీసీరోడ్డుపనులను సర్పంచ్ సునీతసాయిలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిద్దయ్య, వార్డు సభ్యులు మంజుల యాదగిరి, నారాయణ, లత శేఖర్, గణపతి, సంతు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలు 12, కార్యదర్శులు నలుగురు

రేగోడు : గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రామ కార్యదర్శులు లేక ఇన్‌చార్జీల పాలన సాగుతోంది. రేగోడు మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా నలుగురే గ్రామ కార్యదర్శులు ఉన్నారు. ఒక్కో గ్రామకార్యదర్శికి నలుగురు గ్రామ పంచాయతీల కార్యదర్శులుగా నియమిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రజలు అంటున్నారు. గ్రామ కార్యదర్శి ఏ గ్రామంలో ఉంటారో తెలియదని అంటున్నారు. గ్రామ కార్యదర్శులను నియమించి గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరుతున్నారు.

నాలుగు పంచాయతీలు ఉన్నాయి : గ్రామ కార్యదర్శి రాములు

నాలుగు గ్రామ పంచాయతీల ఇన్‌చార్జిగా ఉంటున్న మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్యం పనులు చేయిస్తున్నాం.


అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ఆర్డీవోను సన్మానించిన ఎమ్మెల్యే

నర్సాపూర్‌రూరల్: జిల్లా స్థాయిలో ఉత్తమ ఆర్డీవో అవార్డు అందుకున్న ఆర్డీవో వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. అలాగే పీఆర్‌డీఈ వేణుగోపాల్, ఎస్ఐ వెంకటరాజాగౌడ్, జూనియర్ అసిస్టెంట్ నాయికోటి నాగరాజు, వీఆర్‌వో ధన్‌సింగ్, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థసేవ చేసినప్పుడే అధికారులకు గుర్తింపు వస్తుందన్నారు. మెదక్ జిల్లాలో నర్సాపూర్‌కు అధికంగా ఉత్తమ అవార్డులు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో శ్రవణ్‌కుమార్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, హబీబ్‌ఖాన్, నాయకులు మల్లేశ్ యాదవ్, కుమ్మరి నగేశ్, రాకేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, శివకుమార్, హైమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు

● రాష్ట్ర కుటుంబ సంక్షేమ అధికారి

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ కల్పన సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తుందని, గర్భిణులకు సీఎం కేసీఆర్ కిట్టు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ కిట్ల పథకం అమలుపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

'హెల్మెట్, లైసెన్సు లేకుంటే జరిమానా'

చిలప్‌చెడ్: మండలంలోని చండూర్ చౌరస్తా వద్ద ఎస్ఐ మల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన పత్రాలు, హెల్మెట్లు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్, లైసెన్సులు తప్పని సరిగా ఉండాలని, ఒక్క ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ లేనివారికి రూ.2వేలు, లైసెన్సు లేకుంటే రూ.500, అతివేగానికి రూ.2,500 జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్లు తప్పకుండా యూనిఫాం ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశం, కానిస్టేబుల్ శేఖర్, హోంగార్డు శివరాం, శ్రీరాములు పాల్గొన్నారు.

పార్ట్‌టైం పోస్టల్ సిబ్బంది సమ్మె

నర్సాపూర్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా ప్రారంభించిన సమ్మెలో భాగంగా బుధవారం నర్సాపూర్ పోస్టాఫీస్ పరిధిలోని పార్ట్‌టైం సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, కమలేష్‌చంద్ర కమిషన్ నివేదిక ప్రకారం ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె నిర్వహిస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఈ సమ్మెలో నర్సింహారెడ్డి, పరమేశ్, శ్రీనివాస్, నర్సింలు, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండపోతుగల్ 'బేటీ బచావో.. బేటీ పడావో'

చిలప్‌చెడ్: మండలంలోని బండపోతుగల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల ఆదేశాలతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విఠల్, వార్డు సభ్యులకు బాలికలచేత రాఖీలు కట్టించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో రక్షాబంధన్

శివ్వంపేట: మండలంలోని శభాష్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ యాదగిరికి రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని తొలగించండి

- ఎంపీటీసీలుగా ఉండి ప్రయోజనం లేదు
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్

నర్సాపూర్: ఎంపీటీసీలుగా గెలుపొంది ఉత్సవ విగ్రహాలుగా తప్పా ప్రజలకు ఏమి చేయలేకపోతున్నామని తమ ఈ పదవులను రద్దు చేయాలంటూ పలువురు సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఏ మాత్రం గౌరవం లేదని సభ్యులు వాపోయారు. మూడు నెలలకోసారి సమావేశానికి రావడం అధికారులు చెప్పిన వాటిని వినడం తప్పా ఏమి పనులు కావడం లేదన్నారు. సమావేశంలో లేవనెత్తిన సమస్యలను అధికారులు వింటున్నారే తప్పా ఒక్క సమస్యను కూడా పరిష్కరించ లేదన్నారు. ఇదిలా ఉండగా ఉపాధక్షుడు శ్రీనివాస్‌గుప్తా, నర్సాపూర్ సర్పంచ్ వెంకటరమణారావు, ఎంపీటీసీలు సురేష్, రాజేందర్, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ తదితరులు మాట్లాడుతూ నర్సాపూర్ డివిజన్‌గా ఏర్పడితే ఎన్నో డివిజన్ కార్యాలయాలు వస్తాయని, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని గొప్పలు చెప్పారన్నారు. కాని ఒక్క ఆర్డీవో కార్యాలయం తప్పా మిగతా కార్యాలయాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ డీఈఈ, పోలీస్ శాఖ డీఎస్పీ పోస్టులు కూడా త్వరలో వస్తాయని స్థానిక ఎమ్మెల్యే చెప్పారని ఇంత వరకు వాటి ఊసే లేదన్నారు. డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకుంటే అసలైన లబ్ధిదారులను గుర్తించే అవకాశముంటుందన్నారు. బీజేపీ ఎంపీటీసీ రాజేందర్ మాట్లాడుతూ సెప్టెంబరు 17న విమోచన దినం అధికారికంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండు చేశారు. జక్కపల్లిలో మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులకు బస్సులు పెంచాలని ఎన్నిమార్లు కోరినా స్పందించడం లేదని చిప్పల్‌తుర్తి సర్పంచ్ లక్ష్మీశ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఎంపీడీవో శ్రవణ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుబెల్లా టీకాపై అవగాహన ర్యాలీ


నర్సాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

నర్సాపూర్‌రూరల్: పట్టణంలో ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో బుధవారం రుబెల్లా టీకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలో ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రాజయ్య, సూపర్‌వైజర్లు గంగాధర్, జయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ చందర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శివ్వంపేటలో

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు రుబెల్లా టీకాలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 17 నుంచి రుబెల్లా టీకాలు వేయించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులున్నారు.

చిలప్‌చెడ్‌లో

చిలప్‌చెడ్: మండల కేంద్రంలో 9నెలల నుంచి 15సంవత్సరాల లోపు బాలబాలికలకు రుబెల్లా టీకాలు వేయించాలని బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం శ్రీలత మాట్లాడుతూ తొమ్మిది నెలల నుంచి పదిహేను సంవత్సరాల లోపు బాలబాలికలకు రుబెల్లా టీకాలు ఇప్పించాలన్నారు. ఈనెల 17నుంచి సెప్టెంబరు 25వ తేదీ వరకు టీకాలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ పద్మా, విద్యార్థులు పాల్గొన్నారు.

హరితహారం టార్గెట్‌ను పూర్తి చేయాలి

- డీపీవో హనూక్, ఎంపీపీ పద్మానర్సింహారెడ్డి


భుజరంపేట్‌లో మొక్కను నాటుతున్న డీపీవో హనూక్, ఎంపీపీ పద్మానర్సింహారెడ్డి

కౌడిపల్లి: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో గ్రామ పంచాయతీలకు కేటాయించిన టార్గెట్‌లను పూర్తి చేయాలని డీపీవో హనూక్ పేర్కొన్నారు. బుధవారం కౌడిపల్లి మండల పరిధిలోని భుజరంపేట్ గ్రామంలో 200 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీపీవో హనూక్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 80శాతం పైగా మొక్కలను నాటారన్నారు. అన్ని పంచాయతీల్లో నూటికి నూరుశాతం టార్గెట్‌లను పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. భుజరంపేట్ గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం, మొక్కలను నాటే కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆయన పేర్కొన్నారు. భుజరంపేట్ గ్రామం నుంచి డంప్‌యార్డు వరకు నాటిన 200 మొక్కలకు ప్రజలు రక్షించాలన్నారు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన ట్రీగార్డులను మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి ఎంపీపీ అధ్యక్షురాలు చిలుముల పద్మానర్సింహారెడ్డి, సర్పంచ్ నాయికోటి కిష్టమ్మ, కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ప్రజల సహకారంతో సంపూర్ణ పారిశుధ్యం'

కౌడిపల్లి: ప్రభుత్వం చేపడుతున్న సంపూర్ణ పారిశుధ్యం కార్యక్రమాలకు ప్రజలందరి సహకారం ఉంటేనే లక్ష్యం నెరవేరుతుందని కౌడిపల్లి ఎంపీపీ అధ్యక్షురాలు చిలుముల పద్మానర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కౌడిపల్లి ఎంపీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమెమాట్లాడారు. సంపూర్ణ పారిశుధ్యంపై గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మణ్, పాషా, శంకర్, జహీరా మక్బూల్, కార్యదర్శులున్నారు.

బదిలీ చేయమంటే సన్మానిస్తారా?

● ఎమ్మెల్యే తీరుపై నాయకుల అసంతృప్తి

శివ్వంపేట: పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ వేణుగోపాల్‌ను బదిలీ చేయమని కోరితే ఉత్తమసేవ అవార్డు ఇప్పించడమే కాకుండా ప్రత్యేకంగా సన్మానించడం పట్ల శివ్వంపేట మండల టీఆర్‌ఎస్ నాయకులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పబ్బరమేష్‌గుప్తా మాట్లాడుతూ మండలంలోని టీఆర్‌ఎస్ నాయకుల మధ్య గ్రూపు తగాదాలతో ఎమ్మెల్యే కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. ఇటీవల డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి స్వగృహంలో చర్చలు నిర్వహించిమన్నారు. ఈ సందర్భంగా శివ్వంపేట పంచాయతీరాజ్ డీఈఈ వేణుగోపాల్, ఎంపీడీవో కౌసల్యాదేవిని బదిలీ చేయాలని కోరారు. అయితే వారిని బదిలీ చేయకపోగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవ అవార్డు ఇప్పించడమే కాకుండా బుధవారం నర్సాపూర్‌లో ప్రత్యేకంగా సన్మానించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే తీరుతో కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కార్యకర్తల మనోభావాలను గుర్తించాలని పబ్బరమేష్‌గుప్తా అభిప్రాయపడ్డారు.

మూఢనమ్మకాలపై అవగాహన

నర్సాపూర్: మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేధిక ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు సైన్సు పట్ల వారిలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తుందని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నర్సింలు తెలిపారు. బుధవారం ఎల్లంకి డిగ్రీకళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ప్రజలలో శాస్త్రీయ దృక్పథం రావాలన్నదే తమ ధ్యేయమన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

- **స్తంభించిన పోస్టల్ సేవలు**
- **మెదక్ పోస్టల్ డివిజన్ అధ్యక్షుడు మల్లయ్య**

తూప్రాన్: దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామీణ తపాలా ఉద్యోగులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెను చేపట్టారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని తూప్రాన్ సబ్‌పోస్టాఫీసు వద్ద ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించమన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, 8గంటలే డ్యూటీ ఉండాలని డిమాండ్ చేశారు. సమ్మెలో మెదక్ పోస్టల్ డివిజన్ మల్లయ్య, మొహినోద్దీన్, శ్రీనివాస్, ఎలిజబెత్, మహేశ్, శంకర్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

సమ్మెతో 200 పోస్టాఫీసులు మూత

మెదక్ పోస్టల్ (మెదక్, సిద్దిపేట జిల్లాలు) డివిజన్ గ్రామీణ తపాల ఉద్యోగులు బుధవారం నుంచి చేపట్టిన సమ్మెతో 200 గ్రామీణ పోస్టాఫీసులు మూతపడ్డాయని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (గ్రామీణ తపాల ఉద్యోగుల) మెదక్ డివిజన్ అధ్యక్షుడు మల్లయ్య పేర్కొన్నారు. తూప్రాన్‌లో సమ్మెలో పాల్గొన్న సందర్భంగా ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మెదక్ డివిజన్ వ్యాప్తంగా 375మంది ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్‌లకు పెన్షన్ మంజూరు చేయాలని, టార్గెట్లు పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయడం, వేధించడం ఆపివేయాలని మల్లయ్య డిమాండ్ చేశారు.

అండర్‌బ్రిడ్జిని నిర్మించాలని ఎంపీకి వినతి

నార్సింగి(చేగుంట): మండల కేంద్రమైన నార్సింగిలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి నార్సింగి నాయకులు వినతిపత్రం అందజేశారు. 44వ నెంబర్ జాతీయ రహదారి నార్సింగి గ్రామం నుంచి వెళ్లగా పాఠశాలకు, ఆస్పత్రికి వెళ్లడానికి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి లేక అనేక ప్రమాదాలు జరిగిన విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి నార్సింగిలో అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని విన్నవించగా తక్షణమే నేషనల్‌హైవే అథారిటీ అధికారులు, సీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మల్లేష్‌యాదవ్, సీనియర్ నాయకుడు శ్రీపతిరావు, నార్సింగి సొసైటీ డైరెక్టర్ కుమ్మరి బాబు పాల్గొన్నారు.



ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నార్సింగి నాయకులు

కంకర మిషన్లను పరిశీలించిన ఆర్డీవో

తూప్రాన్: మండలంలోని ఘనపూర్ శివారులోని కంకర మిషన్లను బుధవారం తూప్రాన్ ఆర్డీవో ఓజే మధు పరిశీలించారు. ఘనపూర్ శివారులోని భారీ ఎత్తున బ్లాస్టింగ్‌లు చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు హెచ్‌ఆర్సీని ఆశ్రయించారు. హెచ్‌ఆర్సీ ఆదేశాల మేరకు ఘనపూర్ శివారులోని కంకర మిషన్లను ఆర్డీవో ఓజే మధు పరిశీలన చేశారు. వారం రోజుల్లో గనులశాఖ అధికారులతో మరోసారి పరిశీలన చేయనున్నట్లు ఆర్డీవో మధు పేర్కొన్నారు.

'హరితహారం టార్గెట్‌ను పూర్తి చేయాలి'

చేగుంట: మండలంలోని అన్ని గ్రామాలలో హరితహారం టార్గెట్‌ను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ మన మండలానికి ఇచ్చిన టార్గెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, 10 లక్షల 80 వేల మొక్కలకు గాను 6లక్షల మొక్కలను నాటడం జరిగిందన్నారు. మిగితా మొక్కలను కూడా వచ్చేనెల 15వ తేదీలోగా పూర్తిస్థాయిలో మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత కార్యదర్శులదేనన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను అందరూ కట్టుకునేలా సహకరించాలని మండలంలో 70శాతం పూర్తయిందని, వందశాతానికి చేరే విధంగా గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ ఉమాదేవి, చేగుంట ఈవో భిక్షపతి, కార్యదర్శులు కల్పన, రాణి, బక్కప్ప, వెంకటేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద వధువుకు పుస్తె మట్టెల పంపిణీ

చేగుంట: పేద వధువుకు పుస్తెమట్టెలను బుధవారం చేగుంట వాసవి క్లబ్ ప్రతినిధులు అందించారు. మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బెదరబోయిన ఎల్లవ్వ యాదయ్యల కుమార్తె శ్రీలత వివాహం ధర్మారం గ్రామానికి చెందిన పరుశరాములుతో బుధవారం ఇబ్రహీంపూర్‌లో జరుగుతుండడంతో పుస్తెమట్టెలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు పరంజ్యోతి, వనితక్లబ్ అధ్యక్షురాలు సంధ్యారాణి, ఇబ్రహీంపూర్ సర్పంచ్ నాగభూషణం, అనురాధపాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మనోహరాబాద్ (తూప్రాన్): మనోహరాబాద్‌లో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా గణపతిపూజ, స్థాప్యదేవతపూజ, గర్త సంస్కారం, మూలమంత్ర హోమాలు, ముత్యాలమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, కళాన్యాసం, ప్రతిష్ఠాంగ హోమాలు, బలిహరణం, నేత్రోన్మాలనం, దిగ్బలి, పూర్ణాహుతి, బింబదర్శనం, అమ్మవారి అలంకారం, దర్శనం, హారతి, తీర్థప్రసాద వితరణ రుత్విక్‌సన్మానం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. 20న బోనాలు ఊరేగింపు ఉంటుందని పాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వైదిక కార్యక్రమాలు మొకిరాల రామశర్మ, కలగ సంపత్‌కుమార్‌శర్మ, ముల్లూరి సందీప్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రుక్మాపూర్‌లో ఘనంగా బోనాల ఊరేగింపు

చేగుంట: మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలో బుధవారం గ్రామదేవతలకు బోనాల ఊరేగింపున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మైసమ్మ, నల్లపోచమ్మ, ముత్యాలమ్మ దేవతలకు ప్రతీఇంటి నుండికి బోనంను సమర్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాలను మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు సమర్పించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మ్యాకల పరమేష్, మ్యాకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను బాధ్యతగా పెంచాలి

- **తూప్రాన్ ఆర్డీవో ఓజే మధు**

తూప్రాన్: పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి బాధ్యతగా పెంచాలని తూప్రాన్ ఆర్డీవో ఓజే మధు సూచించారు. బుధవారం మనోహరాబాద్ మండలం కోనాయపల్లి (పీటీ)లో బుధవారం బ్లాక్ ప్లాంటేషన్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో మధు మాట్లాడుతూ, పర్యావరణ దెబ్బతింటే రానున్న తరాలకు ఇబ్బందులుంటాయన్నారు. కోనాయపల్లి (పీటీ)లో హరితహారంలో కార్యక్రమంలో బ్లాక్ ప్లాంటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్, వైకుంఠధామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బుధవారం ఒక్కరోజే 2వేల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచు యంజాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచు సుధాకర్ రెడ్డి, తహసీల్దారు నజీబ్ అహ్మద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, పంచాయతీ కార్యదర్శి శంకర్ గౌడ్, వీఆర్వోలు రామారావు, జయభరత్‌రెడ్డి, పాండు తదితులు పాల్గొన్నారు.



కోనాయపల్లి ప్లాంటేషన్‌లో మొక్కను నాటుతున్న ఆర్డీవో మధు

'మండల విద్యాధికారి మాకొద్దు'

చేగుంట: చేగుంట మండల విద్యాధికారి గంగాబాయి తమకొద్దంటూ ఉపాధ్యాయులు ఎంపీడీవో అనిల్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. చేగుంట మండలపరిషత్ కార్యాలయం వద్ద సమావేశమైన ఉపాధ్యాయులు మండల విద్యాధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. నెలరోజులుగా ఎంఈవో వైఖరితో ఉపాధ్యాయులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎంఈవోకు వ్యతిరేకంగా ధర్నాలు చేసి డీఈవోకు వినతిపత్రాలు అందించినా ఆమెను మార్చకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒకవేళ మార్చని పక్షంలో ఈనెల 20వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటరాంరెడ్డి, హన్మంతరావు, విజయసేనారెడ్డి, సిద్దయ్య, గంగయ్య, రంగారెడ్డి, రమేష్‌గౌడ్, రామారావు, సత్యనారాయణ, రజిత, నీరజ, మంజీర, పర్వానాతో తదితరులు పాల్గొన్నారు.

'రుబెల్లా టీకాలు వేయించాలి'

చేగుంట: రూబెల్లా టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ కోరారు. చేగుంటలోని మండలపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి తట్టు, రూబెల్లా టీకా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈనెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఒకే టీకాతో రెండు వ్యాధులను నివారించే కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ చేపట్టినట్టు వెల్లడించారు. తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అనిల్‌కుమార్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

రుబెల్లాపై అవగాహన ర్యాలీ

వెల్దుర్తి: రుబెల్లా(తట్టు)వ్యాధి నివారణకు 9-15 సంవత్సరాల లోపు చిన్నారులు టీకాలు వేయించుకోవాలని బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాఠశాల విద్యార్థులక వెల్దుర్తి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 'పాపన్న' జయంతి వేడుకలు

నార్సింగి(చేగుంట): పోరాటయోధుడు సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ 367వ జయంతి వేడుకలు నార్సింగిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రమైన నార్సింగిలోని గౌడసంఘం ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. గౌడ కులంలో పుట్టి రాజ్యాలను గడగడలాడించిన పాపన్నగౌడ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని మండలపరిషత్ ఉపాధ్యక్షుడు ఆకుల మల్లేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జయంతి వేడుకల్లో మల్లేష్‌గౌడ్, సిద్దాగౌడ్, శంకర్‌గౌడ్, యాదాగౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

'రేషన్ సరుకులకు ఇబ్బంది పెడుతున్నాడు'

మనోహరాబాద్ (తూప్రాన్): రేషన్ దుకాణం సమయానికి తీయడం లేదు.. ఉపాధి కూలీ డబ్బులియ్యకుండా పోస్టుమేన్ ఇబ్బందులు పెడుతున్నాడని ధర్మరాజ్‌పల్లి గ్రామ మహిళలు తూప్రాన్ ఆర్డీవో మధుకు ఫిర్యాదు చేశారు. బుధవారం మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో హరితహారం ప్లాంటేషన్ చేసేందుకు తూప్రాన్ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మహిళలు తమ ఇబ్బందులను ఆర్డీవో మధు దృష్టికి తీసుకొచ్చారు. ఆమ్లేట్ గ్రామంగా ఉన్న ధర్మరాజ్‌పల్లిలో రేషన్ డీలర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రేషన్ దుకాణంను ధర్మరాజ్‌పల్లిలో ఏర్పాటు చేయాలని మహిళలు వినతి చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని తహసీల్దారు నజీబ్‌అహ్మద్‌కు సూచించారు. ఈమేరకు ఏపీవోను పంపించి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

నార్సింగి(చేగుంట): మండలంలోని వల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను దాతల సహకారంతో అందజేశారు. వల్లూరు పాఠశాల విద్యార్థులకు నార్సింగి గ్రామానికి చెందిన కటికె పవన్‌కుమార్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా నార్సింగి ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ దాతల సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ ఉపాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, నార్సింగి ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, హెచ్ఎం అశోక్, మాజీ సర్పంచ్‌లు నర్సింలు, అంబరీష, తదితరులున్నారు.

గొర్రెలను బతికించండి సారూ...

రోగాలతో మృత్యువాత పడుతున్న జీవాలు ఆందోళనలో లబ్ధిదారులు

• మండలానికి వంద యూనిట్ల పంపిణీ • వైద్య సదుపాయం కరువు • వ్యాధుల బారిన పడుతున్న గొర్రెలు



కంది: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం నిర్వీర్యమవుతోంది. "గొర్రెలను బతికించమని లబ్ధిదారులు అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. ఈ పథకంలో భాగంగా పంపిణీ చేసిన గొర్రెల ఆరోగ్య పరిరక్షణకు వైద్యాధికారులు సరైన జాగ్రత్తలు, వైద్యసేవలు అందించకపోవడం శాపంగా మారింది. మండలంలోని 17 గ్రామాల్లో వంద యూనిట్లను మంజూరు చేశారు. 2100 గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు కానీ వాటి ఆరోగ్య పరిరక్షణకు మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది కొరతతో పశువులకు వైద్యం అందకపోవడంతో మృత్యువాత పడుతున్నాయి. డోన్ నుంచి గొర్రెలను తీసుకొస్తూ ఇక్కడ పంపిణీ చేయడంతో వాతావరణంలో మార్పుల వల్ల అవి నిత్యం అనారోగ్యానికి గురవుతున్నాయి. వైద్యసిబ్బంది కొరతతోపాటు మందుల సరఫరాలో కూడా లోటుపాట్లు ఉన్నాయి. పథకం ద్వారా పొందే 21 గొర్రెలకు తమ వంతుగా రూ.31,500 చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గొర్రెలను పొందిన అనంతరం వాటిని రక్షించలేకపోతున్నామనే చింత లబ్ధిదారుల్లో ఎక్కువైంది. దాంతో గొర్రెలను తీసుకోపోవడమే ఉత్తమనే యోచనలో పడుతున్నారు.

వాతావరణంలో మార్పులే కారణమా?

ప్రాంతం మారడంతో వాతావరణంలో మార్పుల వల్ల గొర్రెలు అనారోగ్యానికి గురవుతున్నాయి. ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో వైద్యాధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొని గొర్రెలు నిత్యం రోగాల బారిన పడుతున్నాయి. పశువుల కోసం అంబులెన్స్ సౌకర్యం కూడా లేకపోవడంతో గొర్రెల పెంపకందారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



రోగాల బారిన పడిన గొర్లు

వైద్యులు అందుబాటులో లేరు



గొర్రెల పంపిణీ పథకం కింద నెల క్రితం 21 గొర్రెలు ఇచ్చారు. కానీ అవి అనారోగ్యం పాలైనా పట్టించుకోవడంలేదు. ఆస్పత్రికి తీసుకుపోతే వైద్యులు అందుబాటులో ఉండడంలేదు.

- రమేశ్, లబ్ధిదారుడు

పొట్టేలే సచ్చిపోయింది



నాకిచ్చిన పొటేలు సచ్చిపోయింది. మరి గొర్రెల సంఖ్య ఎలా పెరుగుతుంది. రోగంతో బాధపడుతున్న గొర్రెలను బతికించేందుకు డాక్టర్లు రారు. వాటి బాగోగులు చూడడం మాకు తెలవదాయే. ఇప్పటి వరకు మందులు కూడా ఇచ్చిన పాపాన పోలేదు. ఇప్పటికైనా సర్కారోళ్లు గొర్రెలను బతికించాలి.

- సుదర్శన్, లబ్ధిదారుడు

ఇంత నిర్లక్ష్యమా?

• పశువుల షెడ్ల బిల్లుల చెల్లింపుపై తాత్సారం • ఆందోళనలో పశుపోషకులు

మద్దూరు: పశుపోషణతో జీవనోపాధి పొందుతున్న రైతులకు జీవాల సంరక్షణ కోసం పాకల నిర్మించడం ఆర్థిక భారంగా మారింది. దీంతో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. బిల్లు చెల్లంచడంలేదు. దీంతో పశుపోషకులు అప్పులపాలై లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకం అందకపోవడంతో పాడిరైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పశుపోషకుల, ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ఉపాధిహామీ పథకం కింద పశువుల షెడ్డు నిర్మాణానికి రూ. 51 వేలు, గొర్ల మేకల షెడ్డు నిర్మాణానికి రూ.49 వేలు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి రూ. 94 వేలు అందిస్తున్నట్లు ప్రకటించింది. పశుపోషకులు కనీసం 4 నుంచి 6 పశువులు, గొర్లమేకల పెంపకందార్లు కనీసం 10 గోర్లుమేకలు, కోళ్ల పెంపకందార్లు కనీసం 100 కోళ్లు కలిగి ఉండాలనే నిబధనలు విధించింది. రైతులు గ్రామపంచాయతీ తీర్మానాలతో పాటు పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రంతో ఈజీఎస్ అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని తెలియజేసింది. కాగా ఒక్కో గ్రామంలో సుమారు 200 మందికిపైగా రైతులు వ్యవసాయానికి అనుబంధంగా గొర్లమేకలు, కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని 20గ్రామాల నుంచి సుమారు 100 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. షెడ్ల మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టి బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.



పశువుల షెడ్డు నిర్మించుకున్న లబ్ధిదారుడు శ్రీనివాస్

గొర్రెల షెడ్డును నిర్మించుకున్న అయిలయ్య



షెడ్డు నిర్మించి ఎనిమిది నెలలయింది

గొర్లమేకల షెడ్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. షెడ్డు మంజూరైనట్లు ఉపాధిహామీ అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లు చెల్లిస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తి చేసి ఎనిమిది నెలలు గడిచింది. బిల్లు కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదు. బిల్లులు వస్తాయంటున్నారే తప్ప ఇప్పటివరకు రూపాయి కూడా రాలేదు. షెడ్డు నిర్మాణానికి రూ. 80 వేలు ఖర్చు చేశా. అధికారుల మాటలు నమ్మి అప్పులపాలయ్యా.


-అయిలయ్య, జీవీల పెంపకందారుడు

వెంటనే బిల్లు చెల్లించాలి

మెదట పశువుల షెడ్డు నిర్మాణానికి రూ. 90 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకుని షెడ్డు నిర్మాణం చేపట్టి మూడు నెలలు గడిచింది. అధికారులు సందర్శించి షెడ్డును తనిఖీ చేసి వెళ్లారు. కానీ నేటికి బిల్లు చెల్లించలేదు. రూ. 2.50 లక్షలు అప్పుచేసి షెడ్డు నిర్మించా. వెంటనే బిల్లు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

- చిగుళ్ల శ్రీనివాస్, పశుపోషకుడు

బతుకులు బండబారుతున్నాయ్



రోలు చెక్కుతున్న భూమయ్య

• పొద్దంతా పని చేసినా కూలి గిట్టుబాటు కష్టమే • ఎలక్ట్రానిక్ పరికరాలతో తగ్గిన రోళ్లు, ఇసుర్రాళ్ల కొనుగోళ్లు

• చిన్న గుడారంలోనే జీవిస్తున్న వడ్డెరలు • డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు

హుస్నాబాద్: పొద్దంతా పని చేసినా పూటగడవడం కష్టం. కుటుంబసభ్యులందరూ కష్టపడినా కూలి గిట్టుబాటు కాని పరిస్థితి వడ్డెరలది. ఇసుర్రాళ్లు, రోళ్లను తొలిచి చెమటోడ్చుతూ జీవనం వెళ్లదీస్తున్నారు ఒడ్డెరలు. చిన్న పాటి గుడారంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వనుకుతూ జీవన నావను కొనసాగిస్తున్నారు. నూతన ఎలక్ట్రానిక్ పరికరాల రూపకల్పనతో వీరు ఉపాధి కోల్పోతున్నారు. కొద్ది రోజుల క్రితం ఏ ఇంట్లో చూసినా రోళ్లు, ఇసుర్రాళ్లు ఉండేవి. ప్రస్తుతం వాటి స్థానంలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటున్నాయి. దీంతో వడ్డెరల ఉపాధి కష్టంగామారింది. 30 సంవత్సరాల క్రితం ఇసుర్రాళ్లు రోళ్లు చెక్కుతూ హుస్నాబాద్‌లో స్థిరపడ్డాడు. భూమయ్య, లక్ష్మీ దంపతులు ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడే గుడారం వేసుకుని పని చేస్తూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు. కుమారుడుతో పాటు కొడలు అనూష కూడ ఈ పనే చేస్తోంది. వారు పొద్దంతా రోళ్లు ఇసుర్రాళ్ల తయారీలోనే నిమగ్నమవుతారు. అనంతరం వాటిని గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తారు. పొద్దంతా పని చేస్తే కూలీ కూడా గిట్టుబాటు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోళ్ల కోసం ఆదిలాబాద్ నుంచి నల్లసరపు బండను తమకు అనుకూలమైన సైజుల్లో తెప్పించుకుంటారు. ఒక్కో రాయికి రూ. 25నుంచి 50 వరకు ఖర్చవుతుంది. రోలు, ఇసుర్రాయిని చెక్కడానికి సుత్తి, ఇనుపసానాలను ఉపయోగిస్తారు. కొన్ని సందర్భాల్లో రాయి పగిలిపోతే శ్రమంతా వృథా అవుతుంది. వేరే పని తెలిక ఈ పని చేస్తూనే బతుకు వెల్లదీస్తున్నామని వారు పేర్కొంటున్నారు. వీరికి ప్రభుత్వ పథకాలు కూడా అందిన దాఖాలాలు లేవు. రేషన్ కార్డులు మాత్రం ఇచ్చారని, ప్రభుత్వం నిర్మించే డబుల్ బెడ్ రూం ఇళ్లు మాకు ఇస్తారనే ఆశతో ఉన్నామని కంది భూమయ్య కుటుంబీకులు తెలిపారు.



ఇసుర్రాయి, రోళ్లకు ఆదరణ తగ్గిపోతుంది

మునుపటి లెక్క ఇసుర్రాళ్లు, రోళ్ల కొంటలేరు. ఊరు మొత్తం తిరిగినా ఒకట్రెండు కూడ అమ్ముడు పోతలేవు. మొదటి నుంచి ఈ పని చేసుకుంటనే బతుకుతున్నం. ఇది కాక వేరే పని రాదయే. రోజంతా చేసినా కూలి పడతలేదు.

- కంది భూమయ్య

డబుల్‌బెడ్ రూం ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి

ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ గుడారం వేసుకుని బతుకుతున్నం. ఎండకు వానకు అరిగోస పడుతున్నం. కుటుంబం మొత్తం చిన్న గుడారంలోనే ఉంటన్నం. గవర్నమెంట్ మాలాంటోళ్లకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇత్తందట. మాకు కూడా ఇత్తే మేలు మరిచిపోం. మాకు ఇయ్యకున్న నా కొడుకు కొడలుకు ఇచ్చిన బాగుంటది.

-కంది లక్ష్మి



భూమయ్య కుటుంబం నివసించే గుడారం




సోయా ఆకుపై పొగాకు లద్దె పురుగు

పప్పు దినుసుల పంటపై

చీడపీడల బెడద

సిర్గాపూర్: ఖరీఫ్ పంటలైన మినుము, పెసర, సోయా పంటలను చీడ పురుగులు ఆశించి నష్ట కలగజేస్తున్నాయి. మండల పరిధిలోని వాసర్, వంగ్దాల్, పొట్‌పల్లి, గరిడేగాం, ముభారక్‌పూర్, అంతర్గాం, సిర్గాపూర్‌లో వర్షాదార భూముల్లో పెసర, మినుము, సోయాను రైతులు అధికంగా సాగు చేశారు. మండలంలో 1260 హెక్టార్లలో పెసర, 580 హెక్టార్లలో మినుము, 872 హెక్టార్లలో సోయా విత్తుకున్నారు. తొలకరి వర్షాలతో పైరు బాగా పెరిగింది. పంటలు పూత దశకు వచ్చే సరికి వర్షాలు కురువక ఎండుముఖం పట్టాయి. గత వారం నుంచి చెదురు ముదురు వర్షపు జల్లులకు పంటలు పచ్చబడ్డాయి. దీంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపించింది. కాని మినుము, పెసర పంటలపై పెనుబంక చేరి నష్టం కలిగిస్తోంది. సోయాలో పొగాకు లద్దెపురుగు, దాసరి పురుగులు చేరాయి. దీని విషయమై మండల వ్యవసాయాధికారి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ చిడపీడల నివారణకు పెసర, మినుము, పంటలకు మోనొక్రొటోపాస్ ద్రావణం ఒక లీటరు నీటికి 1.5 నుంచి 2 మి.లీటర్ల కలిపి పిచికారి చేయాలని సోయాకు క్లోరోపెరిపాస్ 2.5 మి.లీటర్ల ఆయాసిపేట్ పౌడర్ 1 గ్రాముకు ఒక లీటరు నీటిలో కలిపి పిచకారి చేస్తే ఫలితం ఉంటుందన్నారు.





మినుము ఆకులపై పెను బంక పురుగు

ఈత మొక్కలు... మేకల పాలు

• పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు



మొక్కలకు నీళ్లుపడుతున్న గీతకార్మికులు

చేర్యాల: గీతకార్మికుల జీవనోపాధి కోసం ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈతమొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఎక్సైజ్‌శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంపై గీత కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. హరితహారంలో పాల్గొని చిత్తశుద్ధితో పనిచేసేవారిని ప్రోత్సహిస్తూనే నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం మందలిస్తున్నా సీఎం కేసీఆర్ సొంత జిల్లాలోనే బేఖాతరు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతి గ్రామంలో గౌడసంఘాల సొసైటీలతో పాటు చెరువు, కుంటకట్టలపై ఈతవనాల పెంపకానికి చర్యలు తీసుకోవాలని తెలిపినప్పటికీ బేఖాతరు చేస్తున్నారన్న ఆరోపణలు అధికారులు ఎదుర్కుంటున్నారు. గతేడాది చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో వేలాది ఈతమొక్కలు నాటామని చెప్పినా, వాటిలో మూడోవంతుకుపైగా ఎండిపోయాయి. గతనెల 12న చేపట్టిన మూడో విడత హరితహారం కార్యక్రమంలోనూ వేలాదిమొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినా అమలులో నిర్లక్ష్యం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు చేర్యాల మండలంలోని కడవేరుగు గ్రామంలో చోటుచేసుకున్న ఘటన నిదర్శనం. కడవేరుగు గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సంఘానికి ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల్లో గతంలో సుమారు 2వేల ఈతమొక్కలు నాటగా సగానికిపైగా ఎండిపోగా మరికొన్ని ఆశించిన స్థాయిలో పెరిగాయి. కానీ ఆ సంఘం పెద్ద నిబంధనలకు విరుద్ధంగా మొక్కలను నేలమట్టం చేసి భూమిని ఇతరులకు కౌలుకు ఇవ్వడంతో గీత కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఇటీవల కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై కొద్దిరోజుల క్రితం చేర్యాల తహసీల్దార్ విజయ్‌సాగర్ విచారణ జరిపి సంఘం పెద్దతో పాటు కౌలుదారును మందలించారు. ఆభూమిలో వెంటనే తిరిగి ఈతమొక్కలు నాటించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. సుమారు రెండు వారాల క్రితం ఈతమొక్కలను సరఫరా చేయించిన ఎక్సైజ్‌శాఖ అధికారులు నాటించడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో మేకలకు మేతగా మారుతున్నాయి. అడుగు ఎత్తు కూడా లేని మొక్కలు తీసుకురాగా, వర్షాభావ పరిస్థితులకు ఎండముఖం పడుతున్నాయి. దీంతో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు నీటిని పడుతున్నా పూర్తిస్థాయి ప్రయోజనం లేదని వాపోతున్నారు. తమ జీవనోపాధికి ఉపకరిస్తాయని భావించినా మొక్క దశలోనే కనుమరుగవుతుండడంతో ఆందోళనలో గౌడ కులస్తులు చెందుతున్నారు. వెంటనే గుంతలు తీయించి మొక్కలు నాటించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మేకలు మేసిన ఈత మొక్కలు

‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?

1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?
ఎ) పుల్లెల గోపిచంద్ బి) వీరేన్ రస్కిన్హ
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా

2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే

3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) ఊహురు కెన్యాట్ట బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమ్ కెన్యాట్ట డి) మవాయి కిబాకి

4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13

5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహాలని డి) అదూర్ గోపాలకృష్ణన్

6. 2017లో లండన్ వేదికగా జరిగిన ‘ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్’ జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?
ఎ) నీరజ్ చోప్రా బి) దవిందర్‌సింగ్ ఖాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్

7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9

8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను ‘నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్’ ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ

9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే ‘ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పిఎంబిజెపై)’ కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యాన

10. 2017 నవంబరు 28న జరిగే ‘ప్రపంచ భాగస్వామ్య సదస్సు’కు ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్

11. మసూమా ఎబ్టేకర్, మౌలావర్ధి అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్

12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేథి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్

13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం ‘ఈ-శక్తి’ అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?
ఎ) స్మాల్ ఇండస్ట్రిస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్

14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ

15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్ధనపుర కొట్టె(శ్రీలంక)
సి) న్యేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)

